# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
22-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 148

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## అందరి టార్గెట్
# హరీష్!

**ఎంఐఎం నేత కుటుంబ వివాహ వేడుకలకు లండన్‌కు**



**అదే వేడుకలకు సీఎం రేవంత్**

**ఇద్దరి మధ్య సయోధ్య అంటూ ప్రచారం**

**రాజకీయ ప్రత్యర్థులతో పాటు సొంతవారు సైతం**

**తెలంగాణ రాజకీయాల్లో విచిత్రం**

తెలంగాణలో విచిత్ర రాజకీయ పరిస్థితులు నడుస్తున్నాయి. అయితే ఎవరికీ ఎవరు శత్రువో.. ఎవరు మిత్రుడో తెలియని పరిస్థితి. ఎందుకంటే తెలంగాణలో బహు పార్టీలు ఉన్నాయి. అయితే అందరి దృష్టి ఇప్పుడు భారత రాష్ట్ర సమితి పై ఉంటుంది. ఆ పార్టీ వరుస అపజయాలు ఎదుర్కొంటోంది. కానీ తెలంగాణ సమాజంలో ఆ పార్టీ ప్రభావం ఎక్కువ. అలాగని అధికారంలోకి వస్తుందని చెప్పలేం.. రాదని అంతకంటే చెప్పలేం.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** అయితే ఆ పార్టీ చుట్టూ తెలంగాణ రాజకీయాలు తిరుగుతుంటాయి. ప్రధానంగా ఆ పార్టీ కీలక నేత హరీష్ రావు నిత్యం హాట్ టాపిక్ అవుతుంటారు. రాజకీయ ప్రత్యర్థులతో పాటు సొంత పార్టీలో వ్యతిరేకులకు ఆయన కేంద్ర బిందువుగా మారుతుంటారు. తాజాగా ఓ అంశంలో హరీష్ రావు టార్గెట్ అయ్యారు.

ఓవైసీ కుటుంబ వేడుకలు..

లండన్ లో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ కుటుంబ

మిగతా 3లో

# షావుకారు జానకి ఇక లేరు!



**ఏడు దశాబ్దాల సినీ ప్రయాణానికి వీడ్కోలు**

**అనారోగ్య సమస్యలతో అలనాటి మృతి**

**దిగ్భ్రాంతిలో భారతీయ చిత్ర పరిశ్రమ**



**క్రైమ్ మిర్రర్, సినీ డెస్క్:** తెలుగు, తమిళ చిత్ర సీమలో తనదైన ముద్రవేసిన సీనియర్ నటి సావుకారి జానకి మృతి చెందారు. గత కొద్ది రోజులుగా వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె శుక్రవారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు.

- మిగతా 2వ పేజీలో

# రేవంత్ అమెరికా పర్యటనకు బ్రేక్!

**రాజకీయ అనుమతులను నిరాకరించిన విదేశాంగ మంత్రిత్వ శాఖ**

**యూకే వరకు ఓకే.. అగ్ర రాజ్యానికి నో పర్మిషన్**

**23న తిరిగి రాష్ట్రానికి ముఖ్యమంత్రి రేవంత్**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో కీలక రాజకీయ పరిణామం. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు విదేశాంగ మంత్రిత్వ శాఖ రాజకీయ అనుమతి నిరాకరించింది. లండన్ పర్యటన ముగించుకుని నేరుగా అమెరికాలోని బోస్టన్, న్యూయార్క్ నగరాలకు వెళ్లాల్సిన సీఎం.. కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంతో ఆగస్టు 23న హైదరాబాద్కు తిరుగు ప్రయాణం కానున్నారు. హార్వర్డ్, ఎం ఐ టి, నార్త్ ఈస్టర్న్, వర్జిన్య టెక్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడానికి సిద్ధమైన వేళ కేంద్రం ఈ నిర్ణయం

మిగతా 2లో



# ప్రచార యుద్ధంలో ఎవరిదిపై చేయి?!

**డిజిటల్, సోషల్ మీడియాను నమ్ముకున్న గులాబీ పార్టీ**

**మాస్ రాజకీయంతో కాంగ్రెస్ ముందుకు..**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో వింత పరిస్థితి కనిపిస్తోంది. మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయిన గులాబీ పార్టీ వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని భావిస్తోంది. ఎందుకు గాను ఆ పార్టీ చేయని ప్రయత్నం అంటూ లేదు.

మిగతా 2లో

# తెలుగు రాష్ట్రాల్లో ఈడి!

**ఏకకాలంలో ఆరు చోట్ల తనిఖీలు**

**కడప ఎంపీ అవినాష్ రెడ్డితో పాటు వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుల ఇళ్లల్లో..**

**రోజంతా నడిచిన హైడ్రామా**





**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలుగు రాష్ట్రాల్లో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనిఖీలు విస్తృతంగా జరిగాయి.

మిగతా 3లో



## అమరావతిలో వేగంగా సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు

**తూళ్లూరులో ఆలయ ప్రతిష్టాపనలో పాల్గొన్న మంత్రి నారాయణ**



# కన్వీనర్ ఎవరు?

## రేసులో ముగ్గురు నేతలు

**ముందంజలో బీహార్ మాజీ సీఎం నితీష్ కుమార్**

**ఏపీ సీఎం చంద్రబాబుకు సైతం వచ్చే ఛాన్స్**

**మరోవైపు అమిత్ షా పేరు..**

కేంద్రంలో ఎన్డీఏ కన్వీనర్ పదవిపై ప్రచారం మొదలైంది. త్వరలో ఎన్డీఏ కన్వీనర్ పదవి భర్తీ చేస్తారని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. 2014 నుంచి ఎన్డీఏ అధికారం చేపడుతూ వస్తోంది. ఇప్పటివరకు మూడు ఎన్నికల్లోను ఎన్డీఏ విజయం సాధించింది.

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్**

ప్రధాని నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించాక ఎన్డీఏ కన్వీనర్ పదవి అనేది లేకుండా పోయింది. వాజ్పేయి హయాంలో జార్జ్ ఫెర్నాండెజ్ ఎన్డీఏ కన్వీనర్ గా ఉండేవారు. ఆయన తర్వాత శరద్ యాదవ్ ఆ బాధ్యతలు చేపట్టారు. ఆయన తరువాత ఆ పదవిని భర్తీ చేయలేదు.

మిగతా 2లో



**ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా**

# ఎదుర్కొందాం

**సవాళ్లను అవకాశంగా మార్చుకోవాలి**

**అక్టోబర్, నవంబర్ నెలలు అత్యంత కీలకం..**

**పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరత రాకుండా చూడాలి**

**భూగర్భ జలాలను అంచనా వేసి, ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించాలి**

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రైతుల కష్టాలను తీర్చాలి**

**వర్క్‌షాపులో పలువురు మంత్రుల సూచన**

మిగతా 2లో

# కొండా ఫ్యామిలీ ఒంటరి!

**మంత్రి సురేఖపై తిరుగుబాటు**

**కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అత్యవసర భేటీ**

**మంత్రివర్గం నుంచి తొలగించడంతోపాటు పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్**



తెలంగాణ కాంగ్రెస్ లో ఇప్పుడు మంత్రి కొండా సురేఖ వ్యవహారం హాట్ టాపిక్. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ లను టార్గెట్ చేసుకొని కొండా సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల కారణంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భగ్గుమన్నారు.

మిగతా 2లో

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** హైదరాబాదులోని సీఎల్పీ కార్యాలయంలో 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీలు అత్యవసరంగా భేటీ అయ్యారు. కొండ సురేఖ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ.. ప్రభుత్వాన్ని ఇరుక్కుని పెడుతున్న కొండా సురేఖను తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని.. పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ హై కమాండ్కు అధికారికంగా తీర్మానం పంపాలని నిర్ణయించారు.

**సీఎంపై వ్యక్తిగత విమర్శలు..**

పరకాల అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కి మద్దతుగా మాట్లాడారు. దీనిపై సుస్మిత పటేల్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అవినీతి ఆరోపణలు చేయడంతో పాటు వ్యక్తిగత దూషణలకు కూడా దిగారు. కాంగ్రెస్ పార్టీలో ఇది కలవరం రేపింది.

మిగతా 2లో

# కన్వీనర్ ఎవరు?

ఇప్పుడు భర్తీ చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది. బీహార్ రాజకీయాలకు దూరంగా నితీష్.. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎన్డీఏ కన్వీనర్ పదవి కోసం ముగ్గురు నేతలు అర్హులుగా కనిపిస్తున్నారు. వారే బీహార్ మాజీ సీఎం నితీష్ కుమార్, ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా. ప్రధానంగా నితీష్ కుమార్ బీహార్ రాష్ట్రానికి సుదీర్ఘకా లంగా ముఖ్యమంత్రిగా సేవలందిం చారు. మొన్ననే ఆ పదవి నుంచి తప్పుకు న్నారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. కేంద్ర మంత్రివర్గ విస్తరణలో ఆయనకు అవకాశం కల్పిస్తారని ప్రచారం నడుస్తోంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉండడం.. బీహార్ అధికారం నుంచి తప్పించడంతో ఆయనకు ఎన్డీఏ కన్వీనర్ పదవి ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇంతకు ముందు ఆయన పార్టీకి చెందిన శరద్ యాదవ్ ఆ పదవి అలంకరించడం.. ఆయనే చివరి వారు కావడంతో.. కొనసాగింపుగా నితీష్ కుమార్ కు అవకాశం దక్కితే బాగుంటుంది అనేది మెజారిటీ ఎన్డీఏ నేతల అభిప్రాయం.

**జాతీయ రాజకీయాలపై ప్రభావం..**

మరోవైపు ఏపీ సీఎం చంద్రబాబు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఎన్డీఏలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి. నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ మూడోసారి అధికారం చేపట్టడానికి ఏపీలో తెలుగుదేశం బలం కీలకంగా మారింది. పైగా జాతీయ రాజకీయాల్లో పనిచేసిన అనుభవం చంద్రబాబుకు ఉంది. ఇండియా కూటమి పార్టీలతో సైతం సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కొన్ని అంశాలపై జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం తేవడానికి చంద్రబాబు ఎంతో అవసరమవుతారు. అందుకే ఆయనకు ఎన్డీఏ కన్వీనర్ గా అవకాశం ఇస్తే బాగుంటుంది అనేది ఒక అభిప్రాయం.

**అమిత్ షా అయితే..**

మరోవైపు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ఎన్డీఏ కన్వీనర్ పదవి ఇస్తే బాగుంటుంది అనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. దానికి కారణం లేకపోలేదు. కేంద్ర ప్రభుత్వంలో ప్రధాని నరేంద్ర మోడీ తర్వాత ఎవరు అంటే మాత్రం అమిత్ షా పేరు వినిపిస్తుంది. అంతలా ప్రభావం చూపుతున్నారు అమిత్ షా. రాజకీయంగా కేంద్ర ప్రభుత్వ పరంగా అన్ని కార్యకలాపాలు అమిత్ షా కనుసనల్లోనే జరుగుతు న్నాయి. అటువంటిప్పుడు ఆయనకే ఎన్డీఏ కన్వీనర్ పదవి ఇస్తే మరింత బాగుంటుంది కదా అనేది బీజేపీ నుంచి వినిపిస్తున్న మాట. కానీ ఎన్డీఏ కన్వీనర్ అనేది బిజెపి ఎప్పుడూ తీసుకోలేదు. మిత్రపక్షాలకి ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చిన దృష్ట్యా... నితీష్ కుమార్ కానీ.. చంద్రబాబుకు కానీ ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# షావుకారు జానకి ఇక లేరు!

94 ఏళ్ల వయసులో తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె చెన్నైలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందారు. షావుకారు సినిమాతో వెండితెరకు పరిచయం అయ్యారు జానకి. ఆ సినిమా పేరు నే తన ఇంటి పేరుగా మార్చుకున్నారు. ఒక్క తెలుగులోనే మాత్రమే కాదు తమిళం,కన్నడ, మలయాళం భాషల్లో దాదాపు 7 దశాబ్దాలపైగా సాగింది ఆమె సినీ ప్రయాణం. ఎన్నో వైవిధ్యమైన పాత్రలకు పెట్టింది పేరు షావుకారి జానకి.

**నటిగా అనేక మలుపులు..**

హీరోయిన్ గా మొదలైన షావుకారి జానకి ప్రస్థానం క్యారెక్టర్ ఆర్టిస్టుగా, తల్లి పాత్రలోనూ తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. రోజులు మారాయి, కన్యాశుల్కం, డాక్టర్ చక్రవర్తి, తాయారమ్మ బంగారయ్య, సంసారం ఒక చదరంగం వంటి ఎన్నో హిట్ తెలుగు చిత్రాలు ఆమె కెరీర్లో నిలిచిపోయాయి. ముఖ్యంగా సంసారం చదరంగం సినిమాలో చిలకమ్మ పాత్రలో ఆమె ఒదిగిపోయారు. ఇప్పటికీ తెలుగు ప్రేక్షకులకు ఆమె గుర్తుండిపోతారు. భారతీయ చిత్ర పరిశ్రమకు ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2022లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఒక తరం నటిగా మొదలై.. తరాలు మారినా తన ఉనికి చాటుకుంటూ వచ్చారు షావుకారు జానకి. అటువంటి నటిని మరోసారి తెలుగు చిత్ర పరిశ్రమలో చూడలేం కూడా. ఆమె మరణంతో దక్షిణాది చిత్రస్యములో మరో దిగ్గజ నటిని కోల్పోయిన విషాదం నెలకొంది.

**ఇల్లు గడవక సినిమాల్లోకి..**

షావుకారి జానకి సినిమా ప్రయాణం విచిత్రం. ఇల్లు గడవక నటిగా మారారు జానకి. ఆమె స్వస్థలం రాజమండ్రి. ఆమె అసలు పేరు శంకరమంచి జానకి. 1950లో వచ్చిన షావుకారు చిత్రం ద్వారా సినీ ప్రవేశం చేశారు. అలా షావుకారు జానకిగా మారారు. ఏడు దశాబ్దాలకు పైగా తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో 400కు పైగా చిత్రాల్లో నటించారు. ప్రముఖ కథానాయకి కృష్ణకుమారి ఆమె సోదరి.. చిన్నతనంలో నాటకాల్లో పలు పాత్రలు పోషిస్తూ కెరీర్ ప్రారంభించారు. 11 ఏళ్లకు రేడియోలో ఒక తెలుగు కార్యక్రమంలో పాల్గొ న్నారు.. చిన్న వయసులోనే వివాహం జరగడం.. మూడు పూటలా తినడానికి కూడా లేని పరిస్థితుల్లో ఆమె తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కుటుంబ భారాన్ని మోయడానికి.. పిల్లల ఆకలి తీర్చేందుకు తన భర్త అనుమతితో సినిమా రంగం వైపు అడుగులు వేశారు. అలా షావుకారు సినిమాతో హీరోయిన్గా అరంగేట్రం చేశారు. తొలి సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో ఆ సినిమా పేరే ఆమె ఇంటిపేరుగా మారిపోయింది. దక్షిణాది భాషల్లో అగ్రనటులతో ఆమె నటించి మెప్పించారు. ఎన్టీఆర్,ఎన్టీఆర్, కరుణానిధి, జయలలిత లాంటి నలుగురు ముఖ్యమంత్రిలతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నారు షావుకారు జానకి. కేవలం హీరోయిన్ గానే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్టుగా దశాబ్దాల పాటు అలరిస్తూ.. 9 పదుల వయసులో కూడా సినిమాల్లో నటించి వృత్తి పట్ల తనకున్న అంకితభావం చాటుకున్నారు.

# కొండా ఫ్యామిలీ ఒంటరి!

(మొదటి పేజీ తరువాయి)



ఇవి వ్యవహారంలో మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసు జారీచేసింది. అయితే తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను మంత్రి సురేఖ బహిరంగంగా ఖండించలేదు సరి కదా.. అది ఆమె వ్యక్తిగత మంది దాటవేయడంపై సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక క్యాబినెట్ మంత్రిగా ఉండి సొంత ప్రభుత్వం పైనే దాడి చేయించడానికి ఎంత మాత్రం సహించకూడదని కూడా వారు అభిప్రాయపడ్డారు.

**ఎమ్మెల్యేల అత్యవసర సమావేశం..**

మరోవైపు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, బిర్లా ఐలయ్య, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య తదితరులు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా కుటుంబం ఏ ఒక్క ఎమ్మెల్యేతో సఖ్యతగా మెలగడం లేదని.. బ్లాక్ మెయిల్ రాజకీయాలకు అలవాటు పడి పార్టీకి నష్టం తెస్తున్నారంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఇతర పార్టీలోకి వెళ్లి అధికారం అనుభవించి.. పార్టీ అధికారంలోకి రాగానే


సీనియర్లమని చెప్పుకుంటూ అనవసర రక్త చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తూ మంత్రివర్గంలో కొనసాగే హక్కు కొండా సురేఖకు లేదు అని తేల్చి చెప్పారు.

**ఒక్కరి మద్దతు కూడా లే..**

మరోవైపు పరిస్థితి చూస్తుంటే కొండా దంపతులు ఒంటరి అయ్యే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. వారి వైఖరి తెలిసి ఎవరు వారికి మద్దతు పలికే పరిస్థితి లేదు. పైగా మంత్రిగా ఉంటూ ఇతర ఎమ్మెల్యేలతో అంతగా సఖ్యత లేదు. ఏకపక్ష వైఖరితో పాటు

అధికారులపై పెత్తనం, ఇతర నియోజకవర్గాల్లో జోక్యం వంటివి వారిపై విమర్శలు ఉన్నాయి. మొత్తం కాంగ్రెస్ పార్టీలో బహిరంగంగా కొండా దంపతులకు మద్దతు తెలిపే పరిస్థితి లేదు. వాస్తవానికి టిఆర్ఎస్ లో ఉండి ఆ పార్టీ మంత్రులుగా పని చేశారు. రేవంత్ పిలుపుతో కాంగ్రెస్లో చేరారు. ముఖ్యమంత్రితో ఎంతో సన్నిహితంగా ఉండేవారు. అయితే రాజకీయ పెత్తనం కోసం ఎంతవరకు అయినా వెళ్లే పరిస్థితి కొండా దంపతులది. కాంగ్రెస్లో తిరిగి చేరేటప్పుడు కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి హామీ ఇచ్చారు. ఆపై పరకాల నియోజకవర్గ బాధ్యతలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ రెండు దక్కకు పోయేసరికి ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారు అంటూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మండిపడుతున్నారు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా కొండా దంపతులకు మద్దతు తెలిపే అవకాశం లేదు. ఒక విధంగా వారు ఒంటరి అయినట్టే.

# ప్రచార యుద్ధంలో ఎవరిదిపై చేయి?!



ఒకవైపు డిజిటల్ మీడియా, మరోవైపు సోషల్ మీడియా సామ్రాజ్యం తో ముట్టడిస్తోంది. అయితే అధికార కాంగ్రెస్ మాత్రం అందుకు భిన్నంగా వెళ్తోంది. మాస్ రాజకీయంతో ఆ పార్టీ ముందు కెళ్తోంది. ఈ క్రమంలో ఆ రెండు పార్టీలు భిన్నమైన వైఖరితో ముందుకు వెళుతున్నాయి. అయితే డిజిటల్ తో పాటు సోషల్ మీడియాతో ముందుకు వెళుతున్న గులాబీ పార్టీ కంటే.. మాస్ ఇమేజ్తో రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో చొచ్చుకు వెళ్తోంది.

**ఆందోళనలకు దూరం..**

గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యవహార శైలిని గమనిస్తే.. కేవలం విలేకరుల సమావేశాలు మాత్రమే కనిపిస్తున్నాయి. ప్రభుత్వంపై ప్రత్యక్ష ఆందోళనలకు ఆయన దూరంగా ఉంటున్నారు. గులాబీ పార్టీ సోషల్ మీడియా వేదికగా విపరీతమైన కంటెంట్ తో సంచలనం సృష్టిస్తోంది. యూట్యూబ్ ఛానల్లు, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్ హ్యాండిల్స్, ఇన్ఫ్లుయెన్సర్లు నెట్వర్క్ ద్వారా.. డిజిటల్ నెట్వర్క్ ను సద్వినియోగం చేసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం పై వ్యతిరేకత పెంచే ప్రయత్నంలో గులాబీ పార్టీ ముందుంది.

**ప్రతిపక్షానికి విరుద్ధంగా..**

ప్రతిపక్షానికి విరుద్ధంగా అధికార కాంగ్రెస్ ముందుకు వెళ్తోంది. ఆ పార్టీ వ్యూహం సాగుతోంది. డిజిటల్ స్పేస్ కంటే ప్రజల మధ్య ప్రతిపక్షంగా ఉండే సభలకు రేవంత్ ప్రాధాన్యమిస్తున్నారు. వారంలో రెండు మూడు బహిరంగ సభలు లేదా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ నేరుగా ప్రజల్లోకి వెళ్తున్నారు. రేవంత్ ప్రసంగాలు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా.. పొలిటికల్ మాస్ డైలాగులు.. వైరల్ స్టేట్మెంట్లతో గులాబీ పార్టీని ఎండగడుతున్నారు.

**అధికార పార్టీకి లోటు..**

అయితే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో బలమైన సోషల్ మీడియా లేకపోవడం మాత్రం లోటు. డిజిటల్ మీడియాలో వచ్చే విమర్శలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ సరైన ప్రభావం చూపలేకపోతోంది. అయితే రేవంత్ క్షేత్రస్థాయిలో తన సుడిగాలి పర్యటనల ద్వారా.. మాస్ ప్రసంగాలతో ఆ లోటును కొంత భర్తీ చేస్తున్నారు. రేవంత్ వ్యూహానికి తోడు బలమైన డిజిటల్ మీడియాను ఏర్పాటు చేస్తే తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీకి తిరుగుండదు.

## అమరావతిలో వేగంగా సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు

అమరావతి: రాజధానిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సీడ్ యాక్సెస్ రహదారి మూడో దశ పనులను ఈనెల 29 నుంచి ప్రారంభిస్తామని మంత్రి నారాయణ చెప్పారు. గుంటూరు జిల్లా తుళ్లూరులోని శ్రీరామలింగేశ్వర స్వామి, శ్రీబాలకోటేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ... ఈ ఆలయం నుంచి రైతులు ప్రారంభించిన పాదయాత్ర విజయవంతంగా జరిగిందని చెప్పారు. రాజధాని నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ నిర్మాణంపై దృష్టి సారించామని.. ఆ తర్వాత విమానాశ్రయం నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారు. ఇకపై ప్రతినెలా ఒక్కో టవర్ నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు. రైతుల ఎ÷-లాట్ల అభివృద్ధి కోసం ఈనెల 27న టెండర్లు ఓపెన్ చేస్తున్నామని, ఆ తర్వాత వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ సహకారంతో వందల ఏళ్లనాటి ఆలయాన్ని గ్రామస్థులు తిరిగి నిర్మిస్తున్నారు. శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, శ్రీ బాల కోటేశ్వర స్వామివార్ల ఆలయ నిర్మాణానికి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. తుళ్లూరు శివాలయానికి ఎంతో ప్రాశస్త్యం ఉందన్నారు. రాజధాని ల్యాండ్ పూలింగ్లో తుళ్లూరు రైతులు ఎంతగానో సహకరించారని తెలిపారు. రాజధాని రైతుల కుటుంబంలో తానూ ఒకడిగా ఉండి పూలింగ్ చేశానని చెప్పుకొచ్చారు.రైతుల త్యాగాలతో తిరిగి అమరావతి రాజధాని అయిందని మంత్రి అన్నారు. ఇదే ఆలయం నుంచి రైతులు న్యాయస్థానం టు దేవస్థానం పాదయాత్ర ప్రారంభించి విజయం సాధించారని చెప్పుకొచ్చారు. నాటి ప్రభుత్వంలో రైతులు, మహిళలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. అమరావతిలో రైతుల రిటర్నబుల్ ఎ÷-లాట్లలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతు న్నాయన్నారు. ప్రతి నెలా ప్రాజెక్టుల వారీగా భవనాలను పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ప్రాజెక్టుల వారీగా రాజధానిలో ల్యాండ్ పూలింగ్ జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం స్పోర్ట్స్ సిటీ, రైల్వే వే ట్రాక్, ఇన్నర్ రింగ్ రోడ్పై దృష్టి సారించినట్లు తెలిపారు. 15 రోజుల్లో సీడ్ యాక్సెస్ రోడ్డును నేషనల్ హైవే కి కలిపే మూడో విడత నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలందరికీ మంత్రి నారాయణ శుభాకాంక్షలు తెలిపారు.

## ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

### ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేయాలి.. మంత్రి సీతక్క వెల్లడి

హైదరాబాద్: ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పెంచడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమైనదని ఈ సందర్భంగా మంత్రి సీతక్క అభివర్ణించారు. మీరు ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేసి.. వారితో పనులు చేయించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రతిరోజు రెండు లక్షల కంటే తక్కువగా కూలీల నమోదు ఉందని వివరించారు. శుక్రవారం హైదరాబాద్ లో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.

# ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం

హైదరాబాద్,ఆగస్ట్21(ఆర్ఎన్ఎ):ఎల్‌నినో ప్రభావంతో రానున్న సవాళ్లను ముందుగానే గుర్తించి తెలంగాణ రాష్ట్రాన్నిఅన్ని విధాలుగా సన్నద్ధం చేయాలని పలువురు మంత్రులు అధికారులకు సూచించారు. ఎల్‌నినో సాధారణ పరిస్థితి కాదని, ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటలు చేతికొచ్చే సమయంలో నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లో ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమీకృత వ్యవసాయ కుంటల పాత్రపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్క, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, వ్యవసాయం, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల సెక్రటరీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాకా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, ఈ విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమావేశం ఏర్పటు చేయడం హర్షనీయమని అన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగే స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని, ప్రధాన జలాశయాల్లోకి కూడా ఆశించిన స్థాయిలో నీరు



చేరలేదని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో అందుబాటులో ఉండే భూగర్భ జలాలపై రోజువారీగా అంచనాలు రూపొందించి, వాటిని జాగ్రత్తగా వినియోగించేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆటో స్టార్టర్లతో రేయింబవళ్లు మోటార్లు నడిపి భూగర్భ జలాలను వృథా చేయకుండా, పంటకు అవసరమైన మేరకే నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటిని గరిష్ఠంగా నిల్వ చేసుకునేలా రాష్ట్రంలోని 44 వేల చెరువులను సంరక్షించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. చెరువుల్లోకి వర్షపు నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టి, వాటిలో నీటిని నిల్వ చేస్తే చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. వాగులు, నదుల్లో అవసరమైన ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాల నిల్వ సామర్థ్యాన్ని పెంచవచ్చన్నారు. ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను సవాలుగా కాకుండా అవకాశంగా మలచుకోవాలని మంత్రి అన్నారు. కొత్త సాంకేతికత కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని, గతంలో మన తాతలు, తండ్రులు అనుసరించిన నీటి సంరక్షణ పద్ధతులను తిరిగి ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, పంచాయతీరాజ్, నీటిపారుదల తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి విపత్కర పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. జిల్లా స్థాయిలో అధికారులు ప్రతిరోజూ సమన్వయ సమావేశాలు నిర్వహించి తమ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. మండల స్థాయిలో మండల అధికారులు, జిల్లా స్థాయిలో జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులు, ప్రజలకు అధికారులు



# అందరి టార్గెట్ హరీష్!

(మొదటి పేజీ తరువాయి)

వివాహ వేడుకలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఆయనతోపాటు గులాబీ పార్టీ కీలక నేత హరీష్ రావు తో పాటు ప్రముఖులు హాజరయ్యారు. అయితే ఇప్పుడు హరీష్ రావు చుట్టూ వ్యతిరేక ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి అది వేరువేరు సందర్భాల్లో జరిగిన విదేశీ పర్యటన. ఆపై శుభకార్యం హాజరు. కానీ తెర వెనుక ఏదో రహస్య రాజకీయ ఒప్పందం జరిగిందని.. గూడుపుఠాణి జరిగింది అంటూ తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్లో హరీష్ రావు చుట్టూ ఒక రాజకీయం మొదలైంది.

**తెలంగాణ పాలిటిక్స్ లో కీలకం**

ఎంత చెప్పుకున్నా తెలంగాణ రాజకీయాల్లో హరీష్ రావు అనే నేత కీలకం. ఆయన గులాబీ పార్టీకి చెందిన కీలక నేత. తనకంటూ ఒక రాజకీయ శైలి, క్షేత్రస్థాయిలో బలం ఉన్న నాయకుడు కూడా. అసెంబ్లీలో ప్రభుత్వంపై ఎదురు దాడి చేయాలన్నా.. పాలనాపరమైన గణాంకాలతో ప్రభుత్వాన్ని నిలదీయాలన్నా.. క్షేత్రస్థాయి సమస్యలపై పార్టీ శ్రేణులను కదిలించాలన్నా హరీష్ రావు ముందు వరుసలో ఉంటారు. ముఖ్యంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన టార్గెట్ చేసుకునే తీరు ప్రత్యేకం. ఆపై సొంత పార్టీలో అంతర్గత రాజకీయాల్లో కల్వకుంట్ల కుటుంబ ఆధిపత్య సమీకరణల మధ్య తనకంటూ తిరుగులేని మాస్ ఫాలోయింగ్ ఆయన సొంతం. గులాబీ పార్టీ క్యాడర్ లోను ఆయనకు ప్రత్యేక ఇమేజ్ ఉంది.

**సొంతవారికి సైతం..**

హరీష్ రావు ప్రత్యేక శైలి రాజకీయ ప్రత్యర్థులకు మింగుడు పడదు. ఒక్కోసారి సొంత పార్టీ శ్రేణులకు సైతం ఎంత మాత్రం నచ్చదు. కేటీఆర్ తో పాటు కవిత వంటి అగ్రసేని నాయకత్వ సమీకరణలు ఒకవైపు.. తనకంటూ సొంత ఇమేజ్ తో పాటు పట్టున్న హరీష్ రావు ఒకవైపు అన్నట్టు ఉంటుంది గులాబీ పార్టీలో పరిస్థితి. అటు రేవంత్ రెడ్డితో వ్యక్తిగత రాజకీయ శత్రుత్వం ఓ రేంజ్ లో ఉంటుంది.. దానిపై గులాబీ పార్టీలో ఒక వర్గానికి అనుమానం కూడా ఉంది. రేవంత్ తో హరీష్ సయోధ్య అంటూ గత కొంతకాలంగా గులాబీ పార్టీని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. అయితే అది హరీష్ రావు కు ఉన్న ఇమేజ్ను తెలియజేస్తుంది తప్ప మరొకటి కాదు. రేవంత్ తో ఎంత శత్రుత్వం పెంచుకుంటే గులాబీ పార్టీలో అంతా అనుమానం అన్నట్టు హరీష్ రావు విషయంలో ఉంది. తాజాగా అసదుద్దీన్ ఓవైసీ కుటుంబ వివాహ వేడుకల్లో ఇది స్పష్టంగా కనిపించింది కూడా



# తెలుగు రాష్ట్రాల్లో ఈడి!

కడప జిల్లా పులివెందులతో సహా మొత్తం ఆరు చోట్ల శుక్రవారం ఉదయం నుంచి ఈడీ అధికారులు సోదాలు చేశారు. ప్రధానంగా కడప ఎంపీ అవినాష్ రెడ్డిని టార్గెట్ చేసుకొని హైదరాబాద్ తో పాటు పులివెందులలో తనిఖీలు కొనసాగాయి. వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులుగా ఉన్న సునీల్ యాదవ్, దేవి రెడ్డి శివ శంకర్ రెడ్డి ఇళ్లల్లో సైతం తనిఖీలు జరగడం విశేషం. కేవలం వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులుగా ఉన్న వారి ఇళ్లల్లో మాత్రమే ఈడీ తనిఖీలు జరుపుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**హైదరాబాద్, పులివెందులలో..**

వైసీపీ కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఇళ్లతో పాటు కార్యాలయాల్లో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ రేట్ విస్తృతంగా సోదాలు చేసింది. హైదరాబాద్ కోకాపేట, పులివెందులలో అవినాష్ రెడ్డి నివాసంతో పాటు కార్యాలయాల్లో తనిఖీలు జరిగాయి. ప్రధానంగా మనీ లాండరింగ్.. అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు ఏమైనా ఉన్నాయా? అన్న కోణంలో ఈడి ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఈడి అధికారులు కీలక డాక్యుమెంట్ల కోసం వెతుకుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా అవినాష్ రెడ్డి ఆస్తుల వివరాలను సేకరిస్తున్నారని ప్రచారం సాగుతోంది. ఒక్క అవినాష్ రెడ్డి ఇంట్లోనే కాదు.. వివేకానంద రెడ్డి హత్య కేసు నిందితుల ఇళ్లలోనూ అధికారులు తనిఖీలు చేపట్టారు. పులివెందులలోని దేవి రెడ్డి శివశంకర్ రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్ ఇళ్లలోనూ తనిఖీలు చేస్తున్నారు అధికారులు. తొండూరు మండలం తుమ్మలపల్లి లో ఎర్ర గంగిరెడ్డి నివాసంలో తనిఖీలు జరిగాయి. పులివెందులలో జగన్ సమీప బంధువు సునీల్ రెడ్డి ఇంట్లో కూడా తనిఖీలు చేశారు.

**సిబిఐ కాకుండా ఈడి..**

అయితే వివేకానంద రెడ్డి హత్య కేసు నిందితుల ఇళ్లలో తనిఖీలు జరగడం మాత్రం ప్రాధాన్యత సంతరించుకుంది. మళ్లీ దర్యాప్తు మొదటి నుంచి ప్రారంభం అవుతుందన్న ప్రచారం నేపథ్యంలో ఈ తనిఖీలు జరిగి ఉంటాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఎందుకు తనిఖీలు జరిపారు అన్నది నిర్దిష్టంగా తెలియలేదు. కానీ నిర్దిష్టంగా వారి ఇళ్లల్లోనే తనిఖీలు జరపడం మాత్రం సంచలనంగా మారింది. ప్రస్తుతం ఈ కేసును సిబిఐ విచారణ చేపడుతోంది. అటువంటిది ఈడీ రంగంలోకి దిగడం ఏమిటనే చర్చ బలంగా వినిపిస్తోంది.

# రేవంత్ అమెరికా పర్యటనకు బ్రేక్!



(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**యూకే నుంచి తిరిగి రాష్ట్రానికి..**

సుదీర్ఘ విదేశీ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధపడిన సంగతి తెలిసిందే. యూకే లోని ఆక్స్ఫర్డ్, కేం బ్రిడ్జ్, ఎల్ ఎస్ ఈ వంటి విద్యాసంస్థల పర్యటనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది కేంద్రం. కానీ అమెరికా పర్యటనను మాత్రం అడ్డుకుంది. దీని వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయన్న ప్రచారం నడుస్తోంది. ముఖ్యమంత్రిగా ప్రభుత్వ హోదాలో వెళ్తున్నప్పటికీ.. అక్కడ ఎన్నారై కాంగ్రెస్ వర్గాలు ఏర్పాటు చేసిన రాజకీయ, పార్టీ సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొనేందుకు షెడ్యూల్ ఖరారు చేసుకోవడమే ఇందుకు ప్రధాన కారణం అని భావిస్తున్నారు. ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం అధికారిక పర్యటనల పేరిట విదేశాలకు వెళ్లే ప్రజాప్రతినిధులు అక్కడి రాజకీయ సభల్లో విస్తృతంగా పాల్గొనడంపై కేంద్రం కఠినంగా వ్యవహరిస్తోంది ఈ కోణంలోని అనుమతి తిరస్కరించి ఉండవచ్చున్న అనుమానాలు వినిపిస్తున్నాయి.

**రద్దు చేసుకున్న సీఎం..**

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కానీ నిబంధనలకు కట్టుబడి పర్యటనలను రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధాన లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణను, ప్రత్యేకించి హైదరాబాద్ గ్లోబల్ నాలెడ్జ్ అండ్ స్కిల్స్ హబ్ గా తీర్చిదిద్దేందుకే తాను ఈ పర్యటన పెట్టుకున్నట్లు రేవంత్ చెబుతున్నారు. దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు విషయంలో రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని రేవంత్ స్పష్టం చేశారు. తాను వెళ్లకపోయినా.. అధికారిక బృందాన్ని అమెరికాకు పంపి ఆయా గ్లోబల్ యూనివర్సిటీలతో కుదుర్చుకోవాల్సిన ఒప్పందాలను, భాగస్వామ్యాలను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు.

# ఫలించిన రాహుల్ పోరాటం

**పెల్లెట్ గన్ కాల్పులపై ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదు**

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ విపక్షనేత రాహుల్ గాంధీ పోరాటం ఫలించింది. రాహుల్ పోరాటానికి కేంద్రం మెడలు వంచింది. రాహుల్ ధర్నాకి తలొగ్గిన ఢిల్లీ పోలీసులు జంతర్ మంతర్ దగ్గర సీజేపీ చలో పార్లమెంట్ నిరసనల్లో పెల్లెట్ గన్ కాల్పులపై ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నీట్ యూజీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జులై 20న విద్యార్థులు చలో పార్లమెంట్ కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. ఈ చలో పార్లమెంట్ తీవ్ర హింసాత్మకంగా మారింది. విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారు. నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జ్, టియర్ గ్యాస్, పె÷-లలెట్ గన్స్ ప్రయోగించారు. సాహిల్ లోచబ్ అనే నిరసనకారుడు పె÷-లలెట్ గన్ కాల్పుల వల్ల తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో సాహిల్ లోచబ్ శుక్రవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆశ్రయించాడు. రాహుల్ గాంధీ స్వయంగా సాహిల్, అతని కుటుంబ సభ్యులను తీసుకుని స్టేషన్?కు వెళ్లి బాధితుడి ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరాడు. కానీ పోలీసులు కేసు రిజిస్టర్ చేసేందుకు ఒప్పుకోలేదు. దీంతో రాహుల్ గాంధీ స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళనకు దిగాడు. బాధితుడి శరీరంలో 200కు పైగా పె÷-లలెట్ షెల్స్ ఉన్నాయని.. ఒక కంటి చూపు కోల్పోయినప్పటికీ కేసు నమోదు చేయరా అని పోలీసులు, కేంద్ర ప్రభుత్వం ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ ధర్నాకు సంఘీభావంగా కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున స్టేషన్ దగ్గరకు చేరుకున్నారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసే వరకు వెనక్కి తగ్గేది లేదని రాహుల్ తెగేసి చెప్పాడు. కాంగ్రెస్ శ్రేణుల భారీ నిరసనలు, రాహుల్ గాంధీ పట్టుబట్టడంతో ఎట్టకేలకు దిగొచ్చిన ఢిల్లీ పోలీసులు బాధితుడు సాహిల్ లోచబ్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు.

## రూపారెడ్డి హంతకులను కఠినంగా శిక్షించాలి

**హన్మకొండలో టీచర్ల ర్యాలీ**

హన్మకొండ: నల్గొండ జిల్లాలోని నాగార్జున హై స్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తూ హనుమకొండ జిల్లా అన్అయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (హడుప్సా ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఏకశిలా పార్క్ నుంచి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో హడుప్సా సభ్య పాఠశాలలకు చెందిన కరెస్పాండెంట్లు, ప్రిన్సిపల్స్?, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో రూపారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు. ర్యాలీ అనంతరం హడుప్సా ప్రతినిధులు హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని డీఆర్వోను కలిసి వినతిపత్రం సమర్పించారు. రూపారెడ్డి హత్యకు బాధ్యులైన వారిపై ఎలాంటి జాప్యం లేకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, దోషులకు తగిన శిక్ష పడేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో హడుప్సా అధ్యక్షుడు తక్కళ్లపల్లి బుచ్చిబాబు, జనరల్ సెక్రటరీ ఎం.సంతోష్రెడ్డి, ట్రెజరర్ డి.శంకర్, చీఫ్ అడ్వైజర్లు జనార్ధన్, వేణుమాధవ్, వైస్ ప్రెసిడెంట్ రాజేశ్వర్రావు, జాయింట్ సెక్రటరీ మధుకర్రెడ్డి, నవీన్రెడ్డి, సంపత్రెడ్డి, రామారావు, వెంకట్రెడ్డి, ఏ.ఎం.రెడ్డి, ప్రభాకర్రెడ్డి పాల్గొన్నారు.

## కాళేశ్వరం నీటితో చెరువులు నింపాలి

**బిఆర్ఎస్ నేతల డిమాండ్**

యాదాద్రి: వర్షాభావంతో ఎండిపోతున్న పంటలను ఆదుకునేందుకు ఆలేరు నియోజకవర్గంలోని చెరువులు, కుంటలను కాళేశ్వరం జలాలతో నింపి రైతులకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రాజాపేట మండలం బొందుగులలో ఎండిపోయిన పంట పొలాలు, చెరువును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కల్లూరి రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పంటలు ఎండిపోతున్నాయన్న సమాచారంతో క్షేత్రస్థాయిలో పరిశీలించగా, నాట్లు వేసిన 25 రోజులకే పంటలు ఎండిపోతున్న దుస్థితి కనిపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సుమారు 50 నుంచి 60 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, మరో 100 ఎకరాల వరకు పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని తెలిపారు. ఈ పరిస్థితిని చూసి గుండె తరుక్కుపోయిందన్నారు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా పాడిపంటలతో కళకళలాడిందని అన్నారు. గత ఏడాది ఆలేరు నియోజకవర్గంలో 1,000 చెరువులు నింపామని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించారని, ప్రస్తుతం వర్షాలు లేక చెరువులు, బోర్లు, బావులు ఎండిపోతున్నా చెరువులు నింపాలనే సోయి ఎందుకు లేదని ప్రశ్నించారు. తక్షణమే కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు జలాలతో ఆలేరు నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు నింపి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే తపాస్పల్లి జలాలతో బొందుగుల చెరువును నింపి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా సీఎం రేవంత్రెడ్డి ఢిల్లీ, విదేశీ పర్యటనలు చేస్తూ రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మాజీ ఎంపీపీ బాలమణి యాదగిరిగౌడ్, జల సాధన సమితి అధ్యక్షుడు ఎర్ర గోకుల జశ్వంత్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మర్ల నాగరాజు, ఉపసర్పంచ్ యండి అబీద్, నాయకులు గుండెగోని శీను, రాంగోపాల్రెడ్డి, వరిమడ్ల బాలకృష్ణ, స్వామి, నిమ్మల సుదర్శన్, బోయిని రాజు, మాపు భాస్కర్ పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మిని కొనసాగించాలి

**ముథోల్ నేతల డిమాండ్**


ఆదిలాబాద్ : పేదింటి ఆడబిడ్డల వివాహానికి ఆర్థికంగా అండగా నిలుస్తున్న కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రెవార్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు ఎన్నిల అనిల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి తహసీల్ కార్యాలయం వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకు ముందు అన్నబావు సాటే, చత్రపతి శివాజీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీ విఠలేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను నిర్వీర్యం చేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉన్నారని, బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈపాటికి ఇన్సూరెన్స్ కంపెనీకి ప్రీమియం చెల్లించకపోవడంతో రైతు బీమా పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## నిరుద్యోగ యువత నుంచి భారీగా వసూళ్లు

**పోలీసుల అదుపులో ఫ్లయింగ్ బోర్డర్స్ నిర్వాహకురాలు**

విశాఖపట్నం:ఐరోపా దేశాల్లో ఆకర్షణీయ కొలువుల పేరిట విశాఖ, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువత నుంచి భారీగా వసూలు చేసిన ఫ్లయింగ్ బోర్డర్స్ నిర్వాహకురాలిని విశాఖ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కన్సల్టెన్సీని నమ్మి మోసపోయిన బాధితులు ఉత్తరాంధ్ర జిల్లాల్లో వందల మంది ఉన్నారు. ఇందులో 15 మందిపైగా బాధితులు రూ.70 లక్షల మేర కోల్పోయామంటూ విశాఖ నగరంలోని గురుద్వారా పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. విశాఖ పోలీసులు సెర్చ్ వారెంట్తో గురువారం కృష్ణాజిల్లా పెనమలూరు మండలం తాడిగడపలోని నిర్వాహకురాలు సౌజన్య ఇంటికి వెళ్లారు. పోలీసులు రావడం గమనించిన ఆమె ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఎంత ప్రయత్నించినా తెరవలేదు. అతికష్టంపై లోపలికి వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె ఇంట్లో ఉన్న బంగారం, వెండి, కొన్ని ఆస్తుల పత్రాలు, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. కృష్ణాజిల్లా నుంచి ఆమెను విశాఖకు తీసుకు వస్తున్నారు. ఫ్లయింగ్ బోర్డర్స్ పేరుతో సౌజన్య, శ్రీనివాస్ దంపతులు ఓ కన్సల్టెన్సీ ఏర్పాటు చేశారు.





స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చింది, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగముగా ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలూ జరుగుతున్నాయి. కానీ, ఒక పౌరుడిగా మనం నిజాయితీగా ఆలోచిస్తున్నామా? ఓటు వేసి చేతులు దులుపుకోవడం, మళ్లీ ఐదేళ్ల పాటు నిద్రపోవడమే పౌర బాధ్యత అనుకుంటున్నామా? ఇది కేవలం రాజకీయాల పై విమర్శ కాదు, భారతీయుల అంతరాత్మను తట్టి లేపే ఒక కఠినమైన ప్రశ్న.

నేడు మనం హక్కులను గట్టిగా డిమాండ్ చేస్తున్నాం కానీ, బాధ్యతలను పూర్తిగా విస్మరిస్తున్నాం. మాట్లాడే స్వేచ్ఛను వాడుకుంటున్నాం కానీ, తప్పును తప్పు అని నిలదీసే నైతిక ధైర్యాన్ని కోల్పోతున్నాం. ఒకవైపు సాంకేతిక నైపుణ్యం, అద్భుతమైన ప్రతిభతో ప్రపంచ వేదికపై భారత్ దూసుకుపోతోంది. మరోవైపు అదే సమాజం రోజువారీ జీవితంలో అవినీతిని, అన్యాయాన్ని అంతేలే అని సమర్థిస్తూ భరిస్తోంది. ఈ మానసిక వైరుధ్యమే నేటి భారతపు అతిపెద్ద ప్రమాదం. మన విద్యావ్యవస్థ విద్యార్థులను కేవలం పరీక్షల కోసం తయారుచేస్తోంది తప్ప, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దలేకపోతోంది.

# రాజకీయాలు మారవు...
# పౌరుడే మారాలి!

మార్కులు, ర్యాంకులు, తేదీలు నేర్పుతున్న చదువు ఓటు విశిష్టతను, పన్ను చెల్లింపు ప్రాధాన్యతను, న్యాయం కోసం నిలబడే సంస్కారాన్ని నేర్పలేకపోతోంది. సమాచార విప్లవం వచ్చింది కానీ, వివేకం వెనకబడిపోయింది. సామాజిక మాధ్యమాల్లో ఒక హ్యాష్ట్యాగ్ పెడితేనో, వైరల్ వీడియోపై స్పందిస్తేనో విప్లవం వచ్చేసిందనుకోవడం పొరపాటు. పదేళ్లుగా మన ఊరి తాగునీటి సమస్య తీరకపోయినా స్పందించకపోవడమే నేటి ఉపరితల చైతన్యానికి నిదర్శనం. తెలుగు నేల చారిత్రాత్మకంగా గొప్ప పోరాటాల గడ్డ. అల్లూరి సీతారామరాజు విప్లవం, వందేమాతరం ఉద్యమం, రైతు పోరాటాలు, తెలంగాణ విమోచన సమరం. ఇవన్నీ ఈ నేల వీరుల త్యాగాలకు ప్రతీకలు. కానీ ఆ స్ఫూర్తి నేడు పాఠ్యపుస్తకాలకు, విగ్రహాల అలంకారాలకే పరిమితమవుతోంది. రాష్ట్రాలు విడిపోయినా రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగ వలసలు, మహిళలపై హింస, ప్రభుత్వ పాఠశాలల క్షీణత వంటి సమస్యలు రెండు వైపులా పునరావృతమవుతూనే ఉన్నాయి. ఈ సమస్యలకు రాజకీయ నాయకుల నుంచే పరిష్కారం వస్తుందని ఆశించడం అమాయకత్వమే అవుతుంది. ఎందుకంటే, ప్రజల నిష్క్రియాత్మకతపైనే నేటి రాజకీయం ఆధారపడి ఉంది. నూతన పౌర చైతన్యం అంటే ఏదో పెద్ద విప్లవమో, హింసతో కూడిన పోరాటమో కాదు. అది చాలా సాధారణమైనది, కానీ అత్యంత శక్తివంతమైనది. మీ గ్రామ పంచాయతీ లేదా పురపాలక సంఘం సమావేశాలకు వెళ్తున్నారా? మీ వీధి డ్రైనేజీ లేదా రోడ్డు బడ్జెట్ ఎంత వచ్చిందో ప్రశ్నించారా? ఈ చిన్న ప్రశ్నలే అసాధారణ మార్పుకు పునాదులు. పన్ను చెల్లించే ప్రతి పౌరుడికి నిధుల వినియోగంపై లెక్క అడిగే పూర్తి హక్కు ఉంది. ఆ హక్కును హుందాగా, స్పష్టంగా ఉపయోగించాలి. మనకు ఇష్టమైన నాయకుడు లేదా మన కులం వారు తప్పు చేసినా, దాన్ని తప్పు అని ఖండించగలిగే నైతికతను పెంపొందించుకోవాలి. ఒక్క మేల్కొన్న పౌరుడు, నిద్రపోతున్న వందమంది ఓటర్ల కంటే ఈ వ్యవస్థను సమర్థవంతంగా ప్రశ్నించగలడు. మహాత్మా గాంధీ అన్నట్లు మీరు సమాజంలో చూడాలనుకుంటున్న మార్పుగా ముందు మీరే మారండి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ హెచ్చరించినట్లు సామాజిక ప్రజాస్వామ్యం పునాదిగా లేనంత కాలం, రాజకీయ ప్రజాస్వామ్యం నిలబడలేదు. నేడు భారత్ ప్రపంచ వేదికపై కీలక శక్తిగా ఎదుగుతున్న ఈ సంధి సమయంలో, పౌరులలో చైతన్యం లేకపోతే ఎలాంటి గొప్ప విధానాలైనా విఫలమవుతాయి. ఇది కేవలం ఒక నినాదం కాదు, మనందరి తక్షణ అవసరం.

ఇది ఏ ఒక్క పార్టీకో, ప్రాంతానికో, మతానికో సంబంధించినది కాదు. ఈ నేలపై జన్మించిన ప్రతి ఒక్కరి బాధ్యత. మేల్కొందాం... ప్రశ్నిద్దాం... న్యాయం వైపు నిలబడదాం!



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

**సవాళ్లను స్వీకరించకుండా..సమస్యలను పరిష్కరించకుండా ఎల్లకాలం పాలన సాగించడం సాధ్యం కాదు. ముఖ్యంగా ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకపోతే ప్రజలు నిరంతరాయంగా ఓటేస్తారని అనుకోవడం కూడా పొరపాటే. ఈ దేశంలో మహామహులను ఓడించిన చరిత్ర ఉంది. భారతీయ జనతాపార్టీ కూడా ఇప్పుడు అదే కోవలోకి వస్తుంది.**

# సవాళ్లను స్వీకరిస్తేనే
# ప్రజలు ఆదరిస్తారు !

ఇటీవల ఎర్రకోట మీదుగా ప్రధాని మోడీ చేసిన ప్రసంగంలో మహిళా రిజర్వేషన్ల గురించి ప్రస్తావించారు. దీనిపై ఎప్పుడో పార్లమెంట్ ఆమోదించినా, మళ్లీ ప్రధాని పదేపదే అదే విషయం ప్రస్తావిస్తూ ప్రజలను తప్పుదోవ పరిణామాల ప్రభావం గురించి చర్చించడం లేదని అనిపిస్తోంది. ఎందుకంటే యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి. ఈ పన్నెండేళ్ల కాలంలో కేంద్రంలో మోదీ నాయకత్వంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ దేశంలో అనేకానేక సంస్కరణలు తీసుకుని వచ్చింది. మౌళికరంగంలో అనేక మార్పులు తెచ్చింది. దేశంలో అభివృద్ధిని పరుగులు పెట్టించింది. రోడ్డు, రైల్వే రంగాల్లో అనూహ్య మార్పులు వచ్చాయి. ఎన్నడూ ఊహించని విధంగా పురోభివృద్ధి కనిపిస్తోంది. అయితే విమానయానరంగం అందనంత ఎత్తులో ఉంది. తిరుపతికి వెళ్లాలంటే భయపడే స్థితలో విమాన టిక్కెట్ రేట్లు పెరిగాయి. విమయానయాన రంగాన్ని ప్రజలకు చేరువ చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారు. ఇక అన్నింటికి మించి విద్యా,వైద్యరంగాలు నీరుగారి పోతున్నాయి. చదువుల, వైద్యం ప్రజలు భరించలేనంత భారంగా మారాయి. వీటిపై కేంద్రం దృష్టి పెట్టడం లేదు. విద్యార్థులు, యువజనుల ఆందోళనను పాలకులు

సభ్యులతో అవతరించిన బీజేపీ నిజానికి పటిష్టంగానే ఉందని ఒప్పుకోక తప్పదు. ఎన్నికలను అవలీలగా గెలిచేందుకు ఒక భారీ యంత్రాంగాన్నే రూపొందించుకుంది. బీజేపీకి తిరుగులేకుండా చేసేందుకు ప్రత్యర్థి పార్టీలను నయానా భయానా వశపరుచుకోవడమో, తుత్తునియలు చేయడమో చేయగలిగింది. అయినా 2024 ఎన్నికల్లో కేవలం 240 సీట్లు మాత్రమే సాధించింది. దీంతో ఎన్డిఎ బలంతో మళ్లీ పగ్గాలు చేపట్టింది. నిజానికి ఇదే ఓ హెచ్చరికగా బిజెపి తీసుకోవాలి. అలా కాకుండా ప్రత్యర్థులను బలహీనపరిచి ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ వస్తోంది. చివరకు బెంగాల్‌ను సైతం వశపరచుకుంది. తిరుగులేని శక్తిగా ఎదిగిన తర్వాత బీజేపీ అగ్ర నాయకత్వాన్ని ప్రశ్నించగల శక్తి పార్టీలో ఎవ్వరికీ లేకుండా పోయింది. మద్దతు ఇస్తున్న పార్టీల్లో టిడిపి సైతం ఎదిరించే స్థితిలో లేదు. కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల నిరసన ఈ పరిణామాలపై

పట్టిస్తున్నారు. ఇప్పుడున్న 542 లోక్‌సభ సీట్లకు మహిళా రిజర్వేషన్లు ప్రకటిస్తే ఎవ్వరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఒకే సమస్యలను పదేపదే ఎత్తి చూపడం ద్వారా ప్రజల్లో కూడా విసుగు తెప్పిస్తుంది. ఇకపోతే డీలిమిటేషన్ కూడా రాజకీయ లబ్దికోసమే తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు. ఈ క్రమంలో ఈ రెండు విషయాల్లో మొన్నటి పార్లమెంట్ సమావేశాల్లో గట్టెక్కించాలనుకున్న మోడీ ద్వయం వ్యూహం బెడిసి కొట్టిందనే చెప్పాలి. ఈ క్రమంలో త్వరలోనే యూపి, పంజాబ్ ఎన్నికలు రాబోతున్నాయి. ఇందుకోసమేనా అన్నట్లుగా బిజెపి కూడా కొత్త కార్యవర్గాన్ని ప్రకటించు కుంది. కొత్తగా కొందరిని పార్టీలోకి తీసుకున్నారు. పార్టీని బలోపేతం చేయడం ద్వారా ముందుకు సాగాలని బిజెపి చూస్తోందనడానికి ఈ కూర్పు నిదర్శనంగా చూడాలి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు, బంకీపూర్ సహా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక ఫలితాల తీరుతెన్నుల తర్వాత భారతీయ జనతా పార్టీ, కేంద్ర ప్రభుత్వ వ్యవహార శైలిలో మార్పు వచ్చింది. అయితే ఇది చెప్పుకోదగ్గ రీతిలో లేదు. ఎందుకంటే ప్రజలు ఆశిస్తున్నది ఇది కాదు. వారు కోరుకుంటున్నది ఇలాంటి మార్పులు కావు. సమాజంలో వస్తున్న మార్పులపై స్పందించాల్సిన అవసరం ఉంది. దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున యువత, విద్యార్థుల్లో ఆలోచనలు మారుతున్నాయి. జన్ జడ్, యువతతో సంబంధాలను ఎలా మెరుగుపరుచుకోవాలన్న ఆలోచనలకు అనుగుణంగా బిజెపిలో మార్పు కనిపించడం లేదు. పన్నెండేళ్ల క్రితం భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం చోటుచేసుకున్న



పట్టించుకోవాలి. అలాకాకుండా అభిజిత్ దీప్కేకు ఆప్‌తో సంబంధాలు ఉన్నాయని వాదించడం సరికాదు. యువతలో వచ్చిన ఆందోళనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. వారు ఏమి కోరుకుంటున్నారో అధ్యయనం చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వం ఎంతవరకు ఆత్మ విమర్శ చేసుకుంటున్నదన్నదే ముఖ్యం. కమలం పార్టీ బాగా విస్తరించిందని, తన కాళ్లమీద తాను నిలబడిందని, ప్రపంచంలో ఎవ్వరికీ లేని కార్యకర్తల బలం ఉందని విర్రవీగితే....ప్రజలు ఊదితే వచ్చే గాలిలో కొట్టుకు పోగలరు. పార్టీ వ్యూహరచన పుణ్యమా అని ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా 14 కోట్ల మంది

ఆత్మావలోకనం చేసుకునేందుకు ఇదో మంచి అవకాశం. దశాబ్ద కాలానికి పైగా మోదీ ఒక రాజకీయ భావజాలాన్ని అనుసరిస్తున్నారు. ఇప్పుడు కొంచెం దానినుంచి బయటకు వచ్చి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ అధ్యక్షుడితో సహా అన్ని నియామకాల విషయంలో మోడీ ద్వయం పెత్తనమే సాగుతోంది. ఇప్పుడు కొత్త కార్యవర్గ కూర్పులోనూ అదే కనిపిస్తోంది. అయితే ఇది చాలదని గుర్తించాలి. ప్రజలకు మంచి చేసుకోవడానికి ఇంకా మంచిపనులు అనేక చేయాలి. ధరలను అదుపు చేయడం మొదలు, నిరుద్యోగ యువతను ఉపాధి, ఉద్యోగాల బాట పట్టించడం ముఖ్యం.

## కొండా సురేఖపై కాంగ్రెస్ పార్టీలో తీవ్ర వ్యతిరేకత

### సిఎం సహా నేతలంతా చర్యలకు పట్టు

మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మిత చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కుమార్తె సుస్మిత చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులి వ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు సురేఖ పార్టీ నుంచి వెళ్లిపోవడం మంచిదని పలువురు ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోక ముందే తప్పుకోవాలన్నారు, ముఖ్యమంత్రిపై తీవ్ర స్థాయిలో చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.



# కాకరేపుతున్న సురేఖ కూతురు సుష్మిత వ్యాఖ్యలు

బుధవారం దిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సీఎం గురువారం లండన్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. దిల్లీలో ఉన్నప్పుడే కొందరు ముఖ్యనాయకులతో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రితోనూ, మరికొందరు మంత్రులతోనూ మాట్లాడినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ బుధవారం మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలినని గురువారం సమాచారం ఇచ్చారు. మూడ్రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. సమ్మక్క-సారలమ్మను దర్శించుకోవడంతో పాటు ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక మంత్రి పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. తమ వర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు.

మరోవైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అన్న సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని చెప్పారు. ఇదే సమయంలో మంత్రి మాజీ ఓఎస్డీ సుమంత్‌పై గురువారం కేసు నమోదైంది. ఓ వ్యాపారిని బెదిరించి దాడిచేసినట్లు వచ్చిన ఫిర్యాదుతో ఈ కేసును పోలీసులు నమోదు చేశారు. గతంలో ఓ వివాదంలో ఇతనిని అరెస్టు చేయడానికి ప్రయత్నించినపుడు కూడా కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఆ సమయంలో పార్టీలోని కొందరి జోక్యంతో పరిస్థితి సద్దుమణిగినా, తాజా పరిణామాల్లో అలాంటి పరిస్థితి కనిపించడం లేదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఇలాంటి వ్యవహారాల్లో ఆచితూచి అడుగేయాలనే అభిప్రాయం కూడా పార్టీలో కొందరు వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. మొత్తమ్మీద ఈ వ్యవహారం రానున్న రోజుల్లో మరిన్ని మలుపులు తిరిగే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయం అని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఆమె మాటలపై వివరణ ఇవ్వాలని మంత్రి కొండా

సురేఖకు ఇప్పటికే పార్టీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసు ఇచ్చింది. మంత్రి వివరణను పరిశీలించాక ఏం చేయాలో ఆలోచిస్తాం‘ అని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. పార్టీకి ఎవరు వ్యతిరేకంగా మాట్లాడినా క్రమశిక్షణ చర్యలు తప్పవు. ఎవరికి వారు పలానా స్థానం నుంచి పోటీ చేస్తామని ప్రకటించడం సరికాదు. టికెట్లు ఇవ్వడంలో సీడబ్ల్యూసీ, అధిష్ఠానానిదే తుది నిర్ణయం. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల ప్రభుత్వంపై ఎందుకు వ్యాఖ్యలు చేశారు? ఆయన ఆవేదన ఏమిటి? అనేది అర్థం చేసుకున్నాం. ఆ నియోజకవర్గంలోని కొత్త, పాత నేతలను సమన్వయం చేసుకుని ముందుకెళ్తాం. నిషేధిత భూములకు సంబంధించిన 22ఏ పై భారాస అనవసర రాద్ధాంతం చేస్తోంది. కిందిస్థాయిలో జరిగిన తప్పులను సరిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారని వివరించారు.

# జర్నలిస్టుల ఇండ్ల స్థలాల
# పాదయాత్ర షెడ్యూల్


## నేటి ఉదయం సుబ్లేడులో ప్రారంభం

**జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో పర్యటన**

**ఇదీ ఏ రాజకీయ పార్టీకి, ప్రభుత్వాలకు వ్యతిరేకం కాదు**

**టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధన కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్- హెచ్ 2843), ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి చేపట్టే పాదయాత్ర తొలిరోజు షెడ్యూల్ ను ఆ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి శుక్రవారం విడుదల చేశారు. నైజాం ప్రభువుకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన జర్నలిస్టు షోయబుల్లాఖాన్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన స్వస్థలం తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలోని విగ్రహం వద్ద శనివారం ఉదయం 8.30 గంటలకు యాత్ర ప్రారంభ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9.30 నుంచి 10 గంటల వరకు సుబ్లేడులో యాత్ర కొనసాగుతుందన్నారు. 10.30 గంటలకు




తిరుమలాయపాలెం చేరుకుంటుందన్నారు. అక్కడి జర్నలిస్టులతో సమావేశమై తహశీల్దారుకు వినతి పత్రం ఇస్తామని తెలిపారు. అక్కడి నుంచి నేరుగా మధ్యాహ్నం 12 గంటలకల్లా కూసుమంచి మండల కేంద్రానికి చేరుకుంటామని తెలిపారు. 2 గంటలకు యాత్ర కూసుమంచి నుంచి బయలుదేరి 3 గంటలకల్లా నేలకొండపల్లి మండల కేంద్రానికి చేరుకుంటుందని అన్నారు. అక్కడ తహశీల్దారుకు వినతి పత్రం ఇచ్చి, సమావేశం అనంతరం పాదయాత్ర ముందుకు సాగుతుందన్నారు. సాయంత్రం 4 గంటలకల్లా యాత్ర ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ వరంగల్ క్రాస్ రోడ్ కు చేరుతుందని, అక్కడ నిర్వహించే సభతో పాలేరు నియోజకవర్గంలో పాదయాత్ర ముగుస్తుందని పేర్కొన్నారు.

ఏ రాజకీయ పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని తెలిపారు. జర్నలిస్టులకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీని గుర్తు చేయటం కోసమే అన్నారు. తదుపరి షెడ్యూల్ ను ఆదివారం ప్రకటిస్తామన్నారు. జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలివచ్చి యాత్రను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ చక్రవర్తి, జిల్లా కమిటీ సభ్యులు జానీపాష, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, అంజయ్య, పాలేరు నియోజకవర్గ నాయకులు యాసా లక్ష్మారెడ్డి, ఎన్డీ కర్ణ, పోలెపొంగు నాగరాజు, భూక్యా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## గండిపేట్ మండల పిఆర్టియుటిఎస్ అధ్యక్షులుగా విస్లావత్ శివరాం





గండిపేట(క్రైమ్ మిర్రర్): పిఆర్టియుటిఎస్ గండిపేట్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జెడ్పిహెచ్ఎస్ హైదర్షాకోట్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 2026--2028 కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. మండల శాఖ అధ్యక్షులుగా జెడ్పిహెచ్ఎస్ మణికొండకు చెందిన విస్లావత్ శివరాం ఎన్నికయ్యారు. మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా ఎంపియుపిఎస్ ఖానాపూర్‌కు చెందిన మధుకర్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా శ్రీనివాస్ రెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా శైలజ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బి. సురేష్ కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలిగా నవనీత ఎంపికయ్యారు. కార్యదర్శి-1గా ఎండీ ఇమ్రాన్ అలీ, కార్యదర్శి-2గా శ్రీనివాస్, మహిళా కార్యదర్శి-1గా రేవతి, మహిళా కార్యదర్శి-2గా శోభారాణి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పిఆర్టియుటిఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు రాఘవేందర్తో పాటు పక్క మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండల ఉపాధ్యాయులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సంఘ బలోపేతానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.


## గంధంగూడలో ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** గంధంగూడలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సుమారు 50 మంది మహిళలు నియమ నిష్ఠలతో వరలక్ష్మీ వ్రత పూజల్లో పాల్గొన్నారు. దాదాపు మూడు గంటల పాటు శ్రీ మాతృ నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. ఉదయం నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారి అభిషేకం, అలంకరణ, వరలక్ష్మీ వ్రతం, కుంకుమార్చన, పారాయణం, మహా మంగళహారతి తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులయ్యారు. వ్రతానికి హాజరైన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాలు సజావుగా జరిగేలా ఏర్పాట్లను పర్యవేక్షించారు. వ్రతం



అనంతరం నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమంలో సుమారు 150 మంది భక్తులు పాల్గొన్నారు. అన్నప్రసాదానికి సహకరించిన దాతలకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వరలక్ష్మీ వ్రతాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన మహిళలు, భక్తులు, కమిటీ సభ్యులకు ఆలయ కమిటీ తరపున పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

## రాజేంద్రనగర్‌లో 2.47 లక్షల ఓట్లు గల్లంతయ్యాయంటూ బీఆర్ఎస్ ఆరోపణ



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ నేపథ్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో భారీ సంఖ్యలో ఓట్లు డిజిటలైజేషన్‌కు నోచుకోలేదని బీఆర్ఎస్ నాయకుడు అందె లక్ష్మణ్‌రావు ఆరోపించారు. సర్ కు ముందు నియోజకవర్గంలో 6,25,283 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 3,88,278 మంది ఓటర్ల డిజిటలైజేషన్ మాత్రమే పూర్తయిందని తెలిపారు. దీంతో సుమారు 2.47 లక్షల మంది ఓటర్ల వివరాలు గల్లంతైనట్లు కనిపిస్తోందన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో భాగంగా 99,496 మంది ఓటర్ల మ్యాపింగ్ సక్రమంగా జరగలేదని, మరో 96,676 మంది ఓటర్ల పేర్లు, చిరునామాల్లో తప్పులు ఉన్నట్లు పేర్కొన్నారు. మొత్తం 1,96,172 మంది ఓటర్లకు అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారని, సంబంధిత పత్రాలను సమర్పించినట్లయితే ఓటు హక్కు కొనసాగుతుందని, లేనిపక్షంలో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని ఆయన తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మణికొండ డివిజన్--127లో 33,423 మంది ఓటర్లు ఉండగా 17,826 మంది, అంటే 53.33 శాతం మంది మాత్రమే డిజిటలైజేషన్ ప్రక్రియలో నమోదయ్యారని లక్ష్మణ్‌రావు తెలిపారు. అలాగే నెక్నంపూర్ డివిజన్--128లో 38,431 మంది ఓటర్లకు గాను 21,290 మంది, అంటే 58.4 శాతం మంది మాత్రమే డిజిటలైజేషన్‌కు సహకరించారని చెప్పారు. మొత్తం 58 పోలింగ్ కేంద్రాలకు గాను 53 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ప్రక్రియ పూర్తయినట్లు వివరించారు. మణికొండ, నెక్నంపూర్ డివిజన్ ప్రజల సౌకర్యార్థం బీఆర్ఎస్ నాయకులు నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సహాయ శిబిరాలకు ప్రజల నుంచి స్పందన లభిస్తోంది. శుక్రవారం మణికొండ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి, తమ పేర్లు ఓటర్ల జాబితాలో సక్రమంగా నమోదయ్యాయా లేదా అనే విషయాలను పరిశీలించుకున్నారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల నంబర్లు 29 నుంచి 81 వరకు ఉన్న ఓటర్లు తమ వివరాలను సరిచూసుకున్నట్లు దివ్యజ్యోతి యువజన సంఘం సభ్యులు కందాడ రఘువరెడ్డి, వంశీకృష్ణ, ఆశీస్, ఆదర్శ్, బిఆర్ఎస్ నాయకులు గుట్టమీది నరేందర్, సుమనాలిని, భానుచందర్ పాల్గొన్నారు...



## నిషేధిత జాబితా 22 ఏ నుండి ఆల్విన్ కాలనీ, ఆస్బెస్టాస్ కాలనీలకు మినహాయింపు?.. సంక్షేమ సంఘం నాయకులు

**కూకట్ పల్లి,ఆగస్టు 21 (క్రైమ్ మిర్రర్):** నిషేధిత జాబితా 22ఏ నుండి ఆల్విన్ కాలనీ, అస్బెస్టాస్ కాలనీ లను మినహాయిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని ఆల్విన్ కాలనీ ఫేస్ టు అసోసియేషన్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తాము కలెక్టర్, సబ్ రిజిస్ట్రాలను కలిసి విషయాన్ని అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. సందర్భంగా అధికారులు తమ కాలనీలను నిషేధిత జాబితా నుండి తొలగించినట్లు తెలిపారని వివరించారు. ప్రభుత్వం విడుదల చేసిన తాజా ఉత్తర్వులతో రిజిస్ట్రేషన్ లకు ఎలాంటి ఆటంకం కలగకుండా సమస్య పరిష్కారం కానున్నట్లు తెలిపారు. అసోసియేషన్ జారీ చేసిన ఎన్వోసీ ద్వారానే రిజిస్ట్రేషన్కు అనుమతించాలని అధికారులను కోరినట్లు పేర్కొన్నారు. నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రయత్నించే వ్యక్తులను గుర్తించాలని అధికారులకు విన్నవించినట్లు పేర్కొన్నారు. తాజా ప్రభుత్వ ఉత్తర్వులతో కబ్జాదారులకు చెక్ పెట్టడానికి మంచి అవకాశం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. కాలనీవాసుల విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకొని నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామని సబ్ రిజిస్టర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణారావు, కట్టా శ్రీనివాసరావు, కొండారెడ్డి, స్వరాజ్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్, ఆఫ్‌సెట్ ప్రింటర్లు, థియేటర్లు, మల్టీప్లెక్స్ యజమానులతో సమావేశం....



**క్రైమ్ మిర్రర్ మియాపూర్ ప్రతినిధి :** ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడం మరియు పోస్టర్ రహిత వాతావరణం కల్పించడం లక్ష్యంగా డిజిటల్ ప్రింటర్లు, ఆఫ్‌సెట్ ప్రింటర్లు, థియేటర్ యజమానులు, మల్టీప్లెక్స్ యజమానులతో శుక్రవారం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా ప్రదేశాల్లో అనధికారికంగా పోస్టర్లు, బ్యానర్లు, గోడలపై రాతలు, కటౌట్లు, ఫ్లెక్సీలు తదితర ప్రకటనల ప్రదర్శనను పూర్తిగా నిరోధించాలని అధికారుల సూచించారు. అలాగే తమ సంస్థల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సీఎంసీ (సైబరాబాద్ మున్సిపాలిల్ కార్పొరేషన్ ) మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ప్రజా ప్రదేశాల్లో పోస్టర్లను ప్రదర్శించబోమని, ఇతరులు ప్రదర్శించేందుకు అనుమతించబోమని సంబంధిత యజమానుల నుంచి అఫిడవిట్/అండర్‌టేకింగ్‌ను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమం ద్వారా పరిశుభ్రమైన, పోస్టర్ రహిత నగర నిర్మాణానికి అందరూ సహకరించాలని అధికారులు కోరారు.

## శేరిలింగంపల్లిలో లింక్ రోడ్లు, రోడ్డు విస్తరణపై ఎమ్మెల్యే గాంధీ సమీక్ష.....

**క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సైబరాబాద్ :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన లింక్ రోడ్లు, రోడ్డు విస్తరణ పనులపై పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ వెంకన్న, టౌన్ ప్లానింగ్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. మసీద్‌బండ, అంజయ్యనగర్ రోడ్ల విస్తరణ, గంగారం చెరువు నుంచి చీఎ-65 మీదుగా అపర్ణ హిల్ పార్క్ వరకు లింక్ రోడ్డు, గౌసియా కేఫ్ నుంచి కిమ్స్ ఆసుపత్రి వరకు రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని కోరారు. మసీద్‌బండ రోడ్డులో స్థలాలు కోల్పోతున్న బాధితులకు టీడీఆర్ ప్రక్రియ వేగవంతం చేసి న్యాయం చేయాలని, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పనులు వేగవంతం చేస్తామని సీసీపీ వెంకన్న హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏసీపీ హబిబా, టీ పీ ఎస్ సంతోష్, ఎల్ ఏ ఓ లు అరుణమ్మ, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.





## రామప్ప దేవాలయంను సందర్శించిన ఎంసిహెచ్ ఆర్ డి శిక్షణ అధికారులు



**క్రైమ్ మిర్రర్, వెంకటాపూర్ :** మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శుక్రవారం హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న అధికారులు భారత్ దర్శన్ లో భాగంగా రామప్ప దేవాలయంను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం గురించి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, ఎంసిహెచ్ఆర్డి అధికారులు శంకర్, నందకిషోర్,, రవి, ఆర్ ఐ రమేష్, టూరిస్ట్ పోలీసులు, రెవెన్యూ, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## వైఎస్ జగన్‌తో చిర్రా రవీందర్ యాదవ్ భేటీ...



**క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి ప్రతినిధి :** హైదరాబాద్ పర్యటనలో వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చిర్రా రవీందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురు నేతలు కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. కుటుంబ యోగక్షేమాలు, ప్రస్తుత పరిణామాలపై చర్చించారు. చాలా కాలం తర్వాత జరిగిన ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

## ఘనంగా భూతరాజు శ్రీహరి జన్మదిన వేడుకలు

**చండూరు, క్రైమ్ మిర్రర్:** చండూరు పట్టణ బిజెపి అధ్యక్షుడు భూతరాజు శ్రీహరి జన్మదిన వేడుకలు స్థానిక టిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టిఆర్ ఫౌండేషన్ చైర్మన్ టామ్ రెడ్డి (వెంకటరామ్ రెడ్డి) ముఖ్య అతిథి గా హాజరయ్యారు. శ్రీహరికి బర్త్డే విషెస్ తెలియజేస్తూ నిజాయితీగా పనిచేస్తూ ప్రజల్లో మరింత పేరు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం కేక్ కోసి మిఠాయిలు పంపిణీ చేశారు. భూతరాజు శ్రీహరి మాట్లాడుతూ ప్రజల మధ్యన ఉంటూ ప్రజా సమస్యల పైన పోరాడుతూనే వారి సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు నకిరేకంటి లింగస్వామి గౌడ్, బొబ్బలి శివ, పడసనబోయిన శ్రీను, పెసర్ల హరీష్,శ్రీనివాస్ ఆస్కాని,ఇరిగి శివ,వల్లపు స్వామి,సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# వరకట్న వేధింపులు, కుల దూషణ కేసులో నలుగురికి జైలు శిక్ష

## నిందితులకు 6 నెలల జైలు.. 12 వేలు జరిమాన

**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన వరకట్న వేధింపులు, వరకట్న నిషేధ చట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నలుగురు నిందితులకు నల్లగొండ ప్రత్యేక సెషన్స్ కోర్టు శిక్ష విధించింది. ఈ మేరకు శు క్రవారం తీర్పు వెలువడినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు. క్రైమ్ నంబర్ 24/2021, సెషన్స్ కేసు నెంబర్ 41/2021లో ఐపీసీ 498-ఏ, వరకట్న నిషేధ చట్టంలోని 3, 4 సెక్షన్లు, ఎస్సీ/ఎస్టీ (పీఓఏ) చట్టంలోని 3(1)(ఆర్)(ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఎ-1 కల్లూరి స్వామినాథ్, ఎ-2 ప్రమీల, ఎ-3 కల్లూరి యాదయ్య, ఎ-4 కల్లూరి ఎల్లయ్యలను నేరస్థులుగా నిర్ధారించిన ప్రత్యేక సెషన్స్ జడ్జి, ఎస్సీ/ఎస్టీ కోర్టు కమ్.. అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి శిక్ష విధించారు.

**మూడు నేరాలకు ఆరు నెలల చొప్పున శిక్ష**

ఐపీసీ 498-ఏ కింద ఒక్కొక్కరికి ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు 1,000 రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 15 రోజుల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. వరకట్న నిషేధ చట్టంలోని సెక్షన్ 3 కింద కూడా ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు శిక్ష, 1,000 రూపాయల జరిమానా విధించారు. ఎస్సీ/ఎస్టీ (పీఓఏ)



చట్టంలోని 3(1)(ఆర్)(ఎస్) సెక్షన్ కింద సైతం ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు శిక్ష, 1,000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. నలుగురు నిందితులపై కలిపి 12 వేల జరిమాన విధించారు.

**శిక్షలు ఏకకాలంలో అమలు.. పోలీసు అధికారులకు ఎస్పీ అభినందనలు**

మూడు నేరాలకు 6 నెలల చొప్పున 18 నెలల శిక్ష విధించినప్పటికీ, అన్ని శిక్షలను ఏకకాలంలో అమలు చేయాలని కోర్టు ఆదేశించింది. దీంతో నిందితులు ఆరు నెలల జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుంది. కేసులో పకడ్బందీ దర్యాప్తు చేసి, నిందితులకు శిక్ష పడేలా కీలకంగా పనిచేసిన ఎస్ఐ ఎ. రాజశేఖర్ రెడ్డి, దర్యాప్తు అధికారి జి. వెంకటేశ్వర్ రెడ్డి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నర్సింహతో పాటు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఎస్‌డీపీఓ కె. శివరాం రెడ్డి, సీఐ కె. ఆది రెడ్డి, ఎస్ఐ బి. శివ ప్రసాద్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే కేసు కోర్టు ప్రాసెస్‌లో సమన్వయంతో విధులు నిర్వహించిన డీసీఆర్‌బీ సీఐ శ్రీను నాయక్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ కె. దుర్గారాజు, లైజన్ అధికారులు పి. నరేందర్, ఎన్. మల్లికార్జున్‌ల సేవలను కూడా ఎస్పీ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తును శాస్త్రీయ పద్ధతుల్లో, నిష్పక్షపాతంగా చేపట్టి, నేరం రుజువయ్యేలా పకడ్బందీ ఆధారాలను సేకరించడంలో పోలీసు అధికారులు సమర్థవంతంగా పనిచేశారని తెలిపారు. దర్యాప్తు, ఆధారాల సేకరణ, కోర్టులో సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ ద్వారా నిందితులకు శిక్ష పడేలా చేయగలిగామని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు. నేరాల దర్యాప్తులో నాణ్యత, నిష్పక్షపాత వైఖరి, పకడ్బందీ ఆధారాల సేకరణకు అధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

## రోడ్డు విస్తరణతో పాటు పేదల ఉపాధిని కాపాడాలి


### ట్రాఫిక్ సమస్యకు ప్రత్యామ్నాయ పరిష్కారాలు చేపట్టాలి

### సంఘ సేవకుడు సంగం శ్రీకాంత్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పార్టీలకు అతీతంగా ప్రజా ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వాక్ థాన్' కార్యక్రమం అభినందనీయమని సంఘ సేవకుడు సంగం శ్రీకాంత్ అన్నారు. మర్రిచెట్టు నుంచి ఓయూ కాలనీకి వెళ్లే రహదారిలో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, చిన్నారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం అవసరమే అయినప్పటికీ, రోడ్డు విస్తరణ పేరుతో మధ్యతరగతి, పేద కుటుంబాల జీవనోపాధి దెబ్బతినకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రోడ్డు విస్తరణ అవసరమని చెప్పడం సులభమేనని, అయితే రోడ్డు పక్కన చిన్న కిరాణా దుకాణం, టిఫిన్ బండి, టైలరింగ్ షాప్, జిరాక్స్ సెంటర్, సెలూన్, స్వీట్ షాప్, కూరగాయల బండి తదితర వ్యాపారాలపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని శ్రీకాంత్ అన్నారు. అక్కడ ఉన్నవి కేవలం చిన్న చిన్న దుకాణాలు కావు.. వాటిపై ఆధారపడి జీవిస్తున్న వందల కుటుంబాల బతుకులు, వారి ఆత్మగౌరవం అని పేర్కొన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా దుకాణాలు తొలగిస్తే వాటిపై ఆధారపడిన కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. షాపులను తొలగించకుండానే ట్రాఫిక్ సమస్యను కొంతవరకు పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టవచ్చని శ్రీకాంత్ సూచించారు. రోడ్డుకు అడ్డంగా లేదా ముందుకు వచ్చిన విద్యుత్



స్తంభాలను రోడ్డు మార్జిన్ చివరకు తరలించడం ద్వారా ప్రయాణానికి మరింత స్థలం అందుబాటులోకి వస్తుందని అన్నారు. అలాగే ఆక్రమణలను క్రమబద్ధీకరించడం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, అందుబాటులో ఉన్న స్థలాన్ని సమర్థంగా వినియోగించడం, రద్దీ సమయాల్లో ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ, అవసరమైన చోట సిగ్నలింగ్ ఏర్పాటు వంటి చర్యలతో సమస్యను తగ్గించవచ్చని తెలిపారు. చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారుల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించాలని శ్రీకాంత్ కోరారు. రోడ్డు విస్తరణ అవసరమైతే ప్రభావితమయ్యే వారికి తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, పునరావాస చర్యలు చేపట్టాలని సూచించారు. అభివృద్ధి అవసరమే.. కానీ అది పేదవాడి పొట్ట కొట్టేలా కాకుండా, అందరి బతుకులకు భరోసా ఇచ్చేలా ఉండాలి. ఎవరి ఉపాధినీ దెబ్బతీయకుండా, విద్యుత్ స్తంభాలను వెనక్కి జరిపి రహదారిని పునర్వ్యవస్థీకరించడం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగా పరిశీలించాలి అని సంగం శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు.




## ఖమ్మగూడెంలో భూ వివాదం.. 73 రాళ్లను ధ్వంసం చేసినట్లు ఫిర్యాదు

**మర్రిగూడ (క్రైమ్ మిర్రర్):** మండలంలోని ఖమ్మగూడెం గ్రామంలో భూ వివాదం నేపథ్యంలో, సరిహద్దు రాళ్లను ధ్వంసం చేసిన ఘటనపై మర్రిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు 21 ఆగస్టు 2026న మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నెంబర్ 126/2026గా కేసు నమోదైంది. భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 329(3), 324(4) కింద కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఖమ్మగూడెం గ్రామానికి చెందిన మార్నేని తానయ్య (55), తనకు గ్రామ శివారులోని సర్వే నెంబర్ 262/ఈలో 2 ఎకరాల 1 గుంట వ్యవసాయ భూమి ఉందన్నారు. తమ భూమిలో చుట్టూ రాళ్లతో సరిహద్దు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే ఈ నెల 7వ తేదీ రాత్రి సుమారు, 10 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన మార్నేని ప్రతాప్, తన భూమిలోకి అక్రమంగా ప్రవేశించి, తనకు కూడా ఎకరం భూమి ఉందంటూ వాదిస్తూ, సరిహద్దులో ఏర్పాటు చేసిన 73 రాళ్లను ధ్వంసం చేసినట్లు ఆరోపించారు. ధ్వంసమైన రాళ్ల విలువ సుమారు 20 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. భూ వివాదాన్ని గ్రామ పెద్దల సమక్షంలో పరిష్కరించేందుకు ప్రయత్నించినప్పటికీ, ప్రతాప్ చర్చలకు ముందుకు రాలేదని తానయ్య పోలీసులకు తెలిపారు. దీనితో న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ, 21 ఆగస్టు సాయంత్రం 5.30 గంటలకు మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసు దర్యాప్తును ఎస్ఐ బొలిశెట్టి రాంబాబు చేపట్టారు.

# నేడు చండూరులో ప్రమాణ పర్వం

**చండూరు, క్రైమ్ మిర్రర్:** చండూరు మున్సిపాలిటీలో దేవుళ్లపై ప్రమాణం వేసే పర్వం నడుస్తోంది. ఇటీవల చండూరులో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్ స్టాప్ నిర్మాణ విషయంలో ఆయన చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు పై అవినీతి ఆరోపణలు చేశారు. డబ్బులు తీసుకుంది.... ఇచ్చిన వాళ్లకు.. తీసుకున్న వాళ్లకు...ఆ దేవుడికి తెలియాలంటూ ఘాటుగా స్పందించారు. దీంతో ఆ మరుసటి రోజే చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు ఎమ్మెల్యే మాటలను ఖండిస్తూ ప్రెస్ మీట్ పెట్టారు. తాను అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తానని కావాలంటే దేవుని మీద ప్రమాణం చేస్తానన్నారు. తాను చేసిన ఆరోపణలపైన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కూడా వచ్చి దేవుడిపై ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. ప్రెస్ మీట్ లో చెప్పినట్టుగానే శిరిదె పల్లి రోడ్ లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాస్ ప్రమాణ పర్వం చేపడుతున్నారు. శుక్రవారం క్రైం మిర్రర్ ప్రతినిధితో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి ఇదే మా ఆహ్వానం అని తప్పనిసరిగా ఉదయం 9గంటల వరకు ఆంజనేయ స్వామి గుడికి వచ్చి దేవునిపైన ప్రమాణం చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. దీంతో స్థానికంగా రాజకీయ హై డ్రామా నెలకొంది. శనివారం ఏం జరగబోతుంది అనేది సర్వత్ర ఆసక్తి నెలకొంది. దేవుడిపై ప్రమాణం వేసే విషయంలో తగ్గేదే లేదని శనివారం దేవుడి పైన ప్రమాణం వేసే కార్యక్రమం ఉంటుందని చైర్మన్ స్పష్టం చేశారు.



# ఇస్నాపూర్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధే లక్ష్యం





**ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం**

**రూ.2.70 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 21:** ఇస్నాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం రుద్రారం, పాశమైలారం, చిట్కుల్ వార్డుల్లో సుమారు రూ.2.70 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రతి వార్డును సమానంగా అభివృద్ధి చేయడంతో పాటు కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తూ మున్సిపాలిటీ సమగ్ర భివృద్ధికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్, మాజీ ఎంపీపీలు శ్రీశైలం యాదవ్, గాయత్రి పాండు, కౌన్సిలర్లు పాండు, సంధ్య నవీన్‌రెడ్డి, లత వెంకటేష్, రాజు, ఆంజనేయులు, వెంకటేష్, అరుణ్, కోఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, బాబా, అసియాబేగం, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుధీర్‌రెడ్డి, కృష్ణ, రాజు, బంద రాజు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## హెచ్‌జిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆర్. ఉపేందర్ రెడ్డి, ఐఏఎస్ బాధ్యతలు స్వీకరణ

**హైదరాబాద్ (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆర్. ఉపేందర్ రెడ్డి= హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆయనకు హెచ్‌జిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పదవిని పూర్తి అదనపు బాధ్యతలు గా తక్షణమే అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆర్. ఉపేందర్ రెడ్డి హెచ్‌జిసిఎల్ ఉన్నతాధికారులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్యకలాపాలు, వివిధ ప్రాజెక్టుల పురోగతి, ముఖ్యమైన అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెచ్‌జిసిఎల్ కు అప్పగించిన ప్రాజెక్టులను సమర్ధవంతంగా అమలు చేయడంతో పాటు నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తొలిరోజు సమీక్షలో భాగంగా మేనేజింగ్ డైరెక్టర్ వివిధ ప్రాజెక్టు ప్రాంతాలను సందర్శించి కొనసాగుతున్న పనులను పరిశీలించారు. క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడి పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించడంతో పాటు పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. హెచ్‌జిసిఎల్ చేపడుతున్న ప్రాజెక్టులపై నిరంతర పర్యవేక్షణ అవసరమని ఆర్. ఉపేందర్ రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతుల పనులను వేగవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు సంబంధిత శాఖలు, సంస్థల మధ్య సమర్ధవంతమైన సమన్వయం ఉండాలని సూచించారు. హెచ్‌జిసిఎల్ నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా అధికారులు చురుకైన విధానంలో పనిచేసి, ప్రాజెక్టులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు.



## 108 అంబులెన్సులో సుఖ ప్రసవం ...!

**పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన రావిర్యాల గ్రామానికి చెందిన ధనలక్ష్మి**

**మహేశ్వరం, ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** 108 అంబులెన్సులో మహిళ సుఖంగా ప్రసవించిన ఘటన మహేశ్వరం మండలంలో చోటుచేసుకుంది.మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామానికి చెందిన ధనలక్ష్మి గురువారం తెల్లవారుజామున 4 గంటలకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్సులో ఆమెను హాస్పిటల్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే జు=జూ డాక్టర్ మనీష్ సూచనల మేరకు అంబులెన్సు సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ దశరథ్ మరియు పైలట్ బాలకృష్ణ నార్మల్ డెలివరీ చేశారు.పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన ధనలక్ష్మిని తల్లీబిడ్డ ఇద్దరినీ కోఠిలోని గాంధీ జనరల్ హాస్పిటల్ కు తరలించి అడ్మిట్ చేశారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.108 సిబ్బంది చొరవతో సుఖ ప్రసవం జరగడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

## భవిష్యత్తులో సాగులో యంత్రీకరణ తప్పనిసరి

**తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి. రాజి రెడ్డి**



**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** భవిష్యత్తులో సాగులో యంత్రీకరణ తప్పనిసరి కానుందని కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి. రాజి రెడ్డి వివరించారు. రాజేంద్రనగర్‌లోని కూరగాయల పరిశోధనా కేంద్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యంత్రీకరణ ఇప్పుడు పెద్ద స్థాయి వ్యవసాయానికి మాత్రమే పరిమితం కాకుండా కూరగాయల పంటలు, పండ్ల తోటల్లో కూడా విస్తృతంగా ఉపయోగపడు తూ రైతులకు అధిక ఉత్పాదకత, తక్కువ శ్రమతో స్థిరమైన సాగు పద్ధతులను అందిస్తుం దన్నారు. ఆధునిక ప్లాంటర్లు, ట్రాన్స్‌ప్లాంటర్లు ద్వారా నాట్లు సమానంగా, వేగంగా జరగడం వల్ల రైతుల శ్రమ తగ్గి దిగుబడి పెరుగుతుంది. యాంత్రిక వీడర్లు, పవర్ టూల్స్ ద్వారా కలుపు నియంత్రణ సులభతరం అవుతుంది, రసాయనాలపై ఆధారపడటం తగ్గుతుంది. ప్రెసిషన్ స్ప్రేయర్లు, డ్రోన్ల వినియోగం ద్వారా ఎరువులు, పంట సంరక్షణ మందులు లక్ష్యపూర్వకంగా పిచికారీ చేయబడతాయి, కాబట్టి వాటి వృథా తగ్గి పర్యావరణానికి రక్షణ లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా స్మార్ట్ సెన్సర్లు, డ్రోన్లు, డిజిటల్ పరికరాల ద్వారా పంట పెరుగుదల, నేల ఆరోగ్యం, పురుగుల ప్రబలతపై తక్షణ సమాచారం అందుతుందని వివరించారు. ఈ సాంకేతికతలు కాలానుగుణ, వాతావరణ–స్నేహపూర్వక వ్యవసాయానికి కీలకమని, రైతులు, పరిశోధకులు, విద్యార్థులు యంత్రీకరణలో మెళకువలు నేర్చుకోవటం ద్వా రా స్థిరమైన ఉద్యాన అభివృద్ధి సాధ్యమ వుతుందని సూచించారు. కార్యక్రమంలో ఎక్స్ మెషిన్ సంస్థ ప్రతినిధి త్రివిక్రమ్ పలు రోబోటిక్ యంత్ర పరికరాలను ప్రదర్శించి పనితీరుని వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రశాంత్, కూరగాయల పరిశోధన స్థానం అధిపతి వి. మురళి, విశ్వవిద్యాలయ విత్తన విభాగం అధికారి డాక్టర్ పిడిగం సైదయ్య, శాస్త్రవేత్తలు డాక్టర్ నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కంచుకోటలో రాజీవ్ గాంధీ జయంతికి చోటేదీ?




**క్రైమ్ మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా మాడ్గుల మండలంలో పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించకపోవడం చర్చనీయాంశంగా మారింది.రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం రాజీవ్ గాంధీకి నివాళు లర్పిస్తూ ఆయన దేశ యువతకు స్ఫూర్తి అని కొనియాడారు.అయితే కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా చెప్పుకునే మాడ్గుల మండలంలో మాత్రం రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించకపోవడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్తగారి మండలంగా మాడ్గులకు ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పుకుంటున్నప్పటికీ, పార్టీకి చెందిన మహానేత జయంతి కార్యక్రమానికే ప్రాధాన్యత లేకపోవడంపై ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

**పేరుకే కంచుకోట.. కార్యక్రమాల్లో మాత్రం వెలితి!**

"కాంగ్రెస్ కంచుకోట అని చెప్పుకోవడమే తప్ప.. పార్టీ మహానేత జయంతిని నిర్వహించే స్థాయిలో కూడా నాయకత్వం లేకపోవడం ఏమిటి?" అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇతర మండలాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాజీవ్ గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించినట్లు తాజా వార్తలు వెలువడ్డాయి. మాడ్గుల మండలం లో మాత్రం ఎందుకు కార్యక్రమం నిర్వహించలేదు? స్థానిక కాంగ్రెస్ నాయకత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో.. కాంగ్రెస్ కంచుకోటగా చెప్పుకునే మాడ్గులలో.. కాంగ్రెస్ మహానేత రాజీవ్ గాంధీ జయంతికే చోటు లేకపోవడం ఇప్పుడు మండల రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

## ఈ నెల 30 లోగా రైతులు వేసిన వరి పంట నమోదు చేసుకోవాలి

**మండల వ్యవసాయ అధికారి బండారి శివ**



**క్రైమ్ మిర్రర్ నాంపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా 2025 26 వానకాలం వారి ధాన్యం కేంద్రాలలో ఏడు రకాల విత్తనాలకు మాత్రమే క్వింటాకు 500 రూపాయల చొప్పున బోనస్ వస్తుందని నాంపల్లి మండల వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. ఏ రకం వరి పంట వేసిన రైతులు, కౌలు రైతులు తప్పనిసరిగా తమ వారి పంట వివరాలను వడ్లను కొనుగోలు చేశారో మీరు ఏ షాపులో అయితే విత్తనాల వడ్లను ఏ షాపులో కొన్నారో ఆ షాప్ దగ్గరకు వెళ్లి ఆగస్టు 30 వ తేదీ వరకు ఆన్ లైన్ లో నమోదు రైతులకు చేయించుకోవాలని సూచించారు.

## వరలక్ష్మీ వ్రతం సందర్భంగా లక్ష్మీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ కౌన్సిలర్ ఉషారాణి



**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** శ్రావణ మాసం వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక లక్ష్మీదేవి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మాజీ కౌన్సిలర్ ఉషారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు, అలంకరణ పూజలు కంటిపాపలా నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులతో కలిసి ఆమె పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, శ్రావణ శుక్రవారం నాడు లక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే సకల ఐశ్వర్యాలు, అష్టభోగాలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, అమ్మవారి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరిపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, భక్తులు, ఆలయ నిర్వాహకులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



## ఢిల్లీ పెద్దలకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసిన మల్లికార్జున్ ఖర్గే**

**వనపర్తి ఆగస్టు 21 క్రైమ్ మిర్రర్:** వనపర్తి శాసనసభ్యులు తూడి మెగారెడ్డి తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షులతో కలిసి శుక్రవారం ఢిల్లీలో మల్లికార్జున్ ఖర్గే గారి నివాసంలో ఆయనను కలిసి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి గారి పై ఫిర్యాదు చేశారు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూకన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీ పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బీఫార్మ్‌ను డబ్బులకు అమ్ముకున్నదంటూ, ఆరోపించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి గారిపై చర్యలు తీసుకోవాలనీ ఆయన కోరారుఎమ్మెల్యే గారు ఇచ్చిన ఫిర్యాదు పై సానుకూలంగా స్పందించిన ఆయన పూర్తిస్థాయిలో విచారించి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సమన్వయం






**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాబోయే గణేష్ చతుర్థి ఉత్సవాలు, గణేష్ విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు శంషాబాద్ జోన్, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జోనల్ కమిషనర్ చంద్రకళ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రద్దీ నిర్వహణ, శాంతిభద్రతలు, పోలీస్ బందోబస్తు వంటి అంశాలపై అధికారులు చర్చించారు. ముఖ్యమైన ప్రాంతాలను గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఊరేగింపులను సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించనున్నారు. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, ఎస్ డబ్ల్యు ఎమ్ విభాగాల అధికారులు రహదారుల మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, లైటింగ్, నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు, వ్యర్థాల తొలగింపు, నిమజ్జనం అనంతరం శుభ్రపరిచే చర్యలపై వివరించారు. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి, ఇరిగేషన్ శాఖలు నిమజ్జన ప్రాంతాల్లో నీటి వనరుల భద్రత, ముందస్తు జాగ్రత్తలపై సూచనలు అందించాయి. విద్యుత్ శాఖ అధికారులు ఊరేగింపు మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ తీగలు, స్తంభాలను తనిఖీ చేసి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను సరిచేయాలని సూచించారు. తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు, లైటింగ్ ఏర్పాట్లలో భద్రతా ప్రమాణాలు పాటించాలని, విగ్రహాలు విద్యుత్ తీగలకు తగినంత దూరంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. సమావేశంలో డిసిపి శంషాబాద్ రాజేష్, డిసిపి ట్రాఫిక్ శంషాబాద్ జోన్ రాహుల్ హెగ్డే, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ ఏసీపీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, హెచ్ఎండబ్ల్యూఎస్-ఎస్‌బి, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు కూడా హాజరై తమ సూచనలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, అవసరమైన ఫీల్డ్ తనిఖీలు నిర్వహించాలని జోనల్ కమిషనర్ ఆదేశించారు. త్సవాలకు ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, రహదారుల నిర్వహణ, విద్యుత్ భద్రత, లైటింగ్, నిమజ్జన ప్రాంతాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు, భక్తులు పోలీస్, జీహెచ్ఎంసీ, విద్యుత్, హెచ్ఎం డబ్ల్యూఎస్ఎస్‌బి, ఇరిగేషన్ తదితర శాఖలకు సహకరిం చాలని, అధికారులు సూచించిన ఊరేగింపు మార్గాలు, సమయాలు, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జోనల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు సురక్షితంగా, ప్రశాంతంగా, పరిశుభ్రంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు శంషాబాద్ జోన్ జీహెచ్ఎంసీ అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



**రామకృష్ణాపూర్ ఆగస్టు 21 (క్రైమ్ మిర్రర్):** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక శ్రీ కోదండ రామాలయం ప్రాంగణంలో శ్రావణ వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు, భక్తులు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ మాస శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు ,అంబా ప్రసాద్ నేతృత్వంలో అర్చకులు శరత్ శర్మ అమ్మవారికి శాస్త్రోక్తంగా వ్రతకల్ప పూజలు జరిపించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పూజా సామగ్రితో శ్రీ వరలక్ష్మీ అమ్మవారిని నిష్ఠతో అర్చించారు. పూజా కార్యక్రమాలు పూర్తయిన తర్వాత వ్రతంలో పాల్గొన్న మహిళలకు తాంబూలాలు అందజేసి, భక్తులందరికీ తీర్థప్రసాదాలు వితరణ చేశారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ సాగిన ఈ వ్రతంలో స్థానిక మహిళలు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈత సరదా ప్రాణం తీసింది.....!

**పాలిటెక్నిక్ విద్యార్థి మృతి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు**

**ప్రిన్సిపల్ ను సస్పెండ్ చేయాలని - ఏబీవీపీ డిమాండ్...!**







**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** ఈత సరదా ఒక పాలిటెక్నిక్ విద్యార్థి ప్రాణాలను బలిగొన్న విషాద ఘటన మహేశ్వరం మండలంలో చోటుచేసుకుంది. మహేశ్వరం మండల పరిధిలోని కేసీ తండా సమీపంలోని కొత్వాల్ చెరువులో ఈతకు వెళ్లిన సుప్రతిక్ (17) మునిగి మృతి చెందాడు. సుప్రతిక్ మహేశ్వరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డి సి ఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

**ఘటన వివరాలు:** పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం భోజనం అనంతరం సుప్రతిక్ తన నలుగురు స్నేహితులతో కలిసి కొత్వాల్ చెరువుకు ఈతకు వెళ్లాడు. ఈత కొడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు లోతైన నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న విద్యార్థులు వెంటనే కళాశాల ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. ప్రిన్సిపాల్ పోలీసులకు తెలియజేయడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ఏబీవీపీ డిమాండ్:** ఈ ఘటనపై ఏబీవీపీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఏబీవీపీ మహేశ్వరం శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వనవాసి కో-కన్వీనర్ రాజేష్ మాట్లాడుతూ, విద్యార్థుల భద్రతకు బాధ్యత వహించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఖండించారు. ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటున్న అధికారులు తమ బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించాలి. ఒక నిండు ప్రాణం పోవడం అత్యంత బాధాకరం" అని అన్నారు.మహేశ్వరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని, ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

## పోచమ్మ తల్లి సన్నిధిలో ఘనంగా హోమం, ప్రత్యేక పూజలు



**గండిపేట్,. ( క్రైమ్ మిర్రర్ ):** మైలర్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం శ్రీ పోచమ్మ దేవాలయంలో గజస్తంభం ఏర్పాటు చేసి, మండలం సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య గజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీ పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, హోమ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తుల కోసం అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహ కులు, స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రిపోర్టర్ సత్యానందం కుటుంబానికి ఆర్థిక చేయూత

**స్నేహితుడి కుటుంబానికి మిత్రులు అందరూ అండగా నిలవడం మానవత్వానికి నిదర్శనం**

**పిల్లల భవిష్యత్తు కోసం రూ.4.50 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్**

**కుటుంబసభ్యులకు బాండ్లను అందజేసిన మాదినేని, వల్లంకొండ, సర్పంచ్, ఉప సర్పంచ్**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** బోనకల్ మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన రిపోర్టర్ మంద సత్యానందం ఇటీవల రోడ్ ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే,ఈ నేపథ్యంలో వారి కుటుంబానికి యూటీఎఫ్ జిల్లా నాయకుడు వల్లంకొండ రాంబాబు ఆధ్వర్యంలో "సత్యానందం కుటుంబానికి ఆర్థిక చేయూత" అని మిత్రులందరితో గ్రూప్ ఏర్పాటు చేసి వారి కుటుంబానికి, ముగ్గురు పిల్లలకు ఆర్థిక సహాయం చేయాలని పిలుపునిస్తే స్పందించి సుమారు 200 మంది రూ. 4,52,000 సేకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం లక్ష్మీపురం సొసైటీలో వారి పిల్లల పేరు మీద ఫిక్స్ డిపాజిట్ చేసి ఆ బాండ్లను కుటుంబసభ్యులకు సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రరావు, సర్పంచ్ మంద కరుణ, ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దాతలు అందించిన ఆర్థిక సహాయాన్ని పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాం అని, దాతల నుంచి సేకరించిన సుమారు రూ. 4.50 లక్షల మొత్తాన్ని పిల్లల చదువుల నిమిత్తం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం జరిగింది అని పేర్కొన్నారు. రిపోర్టర్ సత్యానందం అకాల మరణంతో ఆయన కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, కుటుంబానికి అండగా నిలిచేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చి తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించిన నేపద్యంలో వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సత్యానందం కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్న దాతలు మానవతా దృక్పథంతో అందించిన సహాయాన్ని మాత్రమే కాకుండా, ఆయన పిల్లల భవిష్యత్తుకు భరోసాగా ఉండేలా వినియోగించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు..సత్యానందం కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్క దాతకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో ఒక కుటుంబానికి మిత్రులు అందరూ అండగా నిలవడం మానవత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. సత్యానందం కుటుంబానికి భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు మా తరుపున అందిస్తామని వారు అన్నారు. సత్యానందం పిల్లల చదువులకు భరోసాగా నిలిచేలా రూ. 4.50 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం ద్వారా దాతలు అందించిన ఆర్థిక సహాయానికి ఒక సార్థకమైన ప్రయోజనం కలిగిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వల్లంకొండ సురేష్, కొమ్ము శ్రీనివాసరావు, ఇరుగు జానేష్, తమ్మారపు లక్ష్మణరావు, పసుపులేటి వెంకటేశ్వర్లు, ఎర్రబోయిన అప్పారావు, నల్లమోతు నాగేశ్వరరావు, ముత్తరపు రవి, మంద జాన్, కల్యాణపు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ HP హైడ్రాలిక్ ఆయిల్ కలకలం

**76 టిన్నులు స్వాధీనం.. విలువ రూ.2.81 లక్షలు --**

**ముగ్గురిపై కేసు నమోదు**




**కోదాడ, ఆగస్టు 21: ( క్రైమ్ మిర్రర్ ):** కోదాడ పట్టణంలో నకిలీ/కల్తీ హైడ్రాలిక్ ఆయిల్‌ను విక్రయిస్తున్నారనే సమాచారంతో కోదాడ టౌన్ పోలీసులు, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (న్యూజా) ప్రతినిధులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 76 హైడ్రాలిక్ ఆయిల్ టిన్నులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 2,81,200గా పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆగస్టు 18న ఉదయం సుమారు 9 గంటలకు కోదాడ పట్టణంలోని గుడిబండ రోడ్, గోపిరెడ్డినగర్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర హైడ్రాలిక్స్ ఆటో మొబైల్స్ షాపులో నకిలీ/కల్తీ HP హైడ్రాలిక్ ఆయిల్ నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. సమాచారం మేరకు పోలీసులు, న్యూజా ప్రతినిధులతో కలిసి షాపులో తనిఖీలు నిర్వహించారు. తనిఖీ సమయంలో షాప్ నిర్వాహకుడు కుర్ర ఎల్లారాజు (33) అక్కడ ఉండగా, షాపులో 26 లీటర్ల సామర్థ్యం కలిగిన 20 హైడ్రాలిక్ ఆయిల్ టిన్నులు గుర్తించారు. వాటిని పరిశీలించిన న్యూజా ప్రతినిధులు, న్యూ కంపెనీ పేరుతో ఉన్న నకిలీ/కల్తీ ఉత్పత్తులుగా అనుమానం వ్యక్తం చేసినట్లు పోలీసులు తెలిపారు. తక్కువ ధరకు కొనుగోలు చేసి.. ఎక్కువ ధరకు విక్రయించాలని విచారణలో ఎల్లారాజు తెలిపిన వివరాల ఆధారంగా పోలీసులు హైదరాబాద్‌లోని లిగుంటి సందీప్ (32)లికు సంబంధించిన షాప్‌పై కూడా తనిఖీలు నిర్వహించారు. అక్కడ 26 లీటర్ల సామర్థ్యం కలిగిన మరో 56 టిన్నులు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఎల్లారాజు సుమారు ఏడాది కాలంగా సందీప్‌కు సంబంధించిన జీజదీ స్పేర్ పార్ట్స్ వ్యాపారం ద్వారా విడిభాగాలు కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు పేర్కొన్నారు. సుమారు నెల రోజుల క్రితం సందీప్ ఫోన్ చేసి, హైదరాబాద్ అఫ్జల్‌గంజ్‌కు చెందిన వసీం ఖాన్ న్యూ కంపెనీకి చెందిన హైడ్రాలిక్ ఆయిల్‌ను తక్కువ ధరకు అందిస్తున్నాడని చెప్పినట్లు తెలిపారు. తక్కువ ధరకు ఆయిల్‌ను కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయించడం ద్వారా లాభాలు పొందాలనే ఉద్దేశంతో ఈ ఆయిల్‌ను కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఎల్లారాజు వద్ద లభించిన 20 టిన్నులు, సందీప్ వద్ద లభించిన 56 టిన్నులు కలిపి మొత్తం 76 టిన్నులను స్వాధీనం చేసుకున్నారు.

**ముగ్గురు నిందితులు**

ఈ వ్యవహారంలో కుర్ర ఎల్లారాజు (33), గుంటి సందీప్ (32), వసీం ఖాన్లను నిందితులుగా పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న 76 టిన్నుల్లో ఒక్కో టిన్ను సుమారు రూ.3,700 విలువ ఉండగా, మొత్తం విలువ రూ.2,81,200గా అంచనా వేశారు. ఆగస్టు 21న ఉదయం 10 గంటల సమయంలో స్వాధీనం ప్రక్రియ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని, దర్యాప్తులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

## కోదాడ పోలీస్ వ్యవస్థపై బొల్లం మల్లయ్య యాదవ్

# సంచలన ఆరోపణలు

**దళిత, గిరిజన, బీసీ వర్గాలపై వేధింపులు ఆపాలి:**

**కోదాడలో ఖాకీ వ్యవస్థ ప్రజల రక్షణకు కాకుండా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతోంది:**

**పోలీసుల వైఫల్యాలపై రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ సమాధానం చెప్పాలి:**

**కోదాడలో శాంతిభద్రతలను కాపాడాలి.. బలహీన వర్గాలపై వేధింపులు నిలిపివేయాలి:**

**మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**





**కోదాడ ఆగస్టు 21 ( క్రైమ్ మిర్రర్)** కోదాడ పోలీస్ వ్యవస్థపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర విమర్శలు కోదాడ నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిస్థితి, పోలీసుల పనితీరుపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. దళిత, గిరిజన, బీసీ, బలహీన వర్గాలకు చెందిన ప్రజలపై అక్రమ వేధింపులు, పోలీసుల నిర్లక్ష్యం, రాజకీయ ఒత్తిళ్లు, మాఫియా కార్యకలాపాలపై రాష్ట్ర ప్రభుత్వం మరియు పోలీస్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విడుదల చేసిన ప్రకటనలో కోదాడలో పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం జరుగుతోందని ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల రాజకీయ జోక్యం కారణంగా కేసుల వ్యవహారాల్లో అసమానతలు చోటుచేసుకుంటు న్నాయని విమర్శించారు. చట్టం అందరికీ సమానంగా వర్తించేలా పోలీస్ శాఖ పనిచేయాలని సూచించారు. అక్రమ పశువుల రవాణా వ్యవహారంలో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు, బాధితులను బెదిరించారన్న ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. అలాగే శిరీష హత్య ఘటన, కర్ల రాజేష్ కస్టడీ మరణం వంటి ఘటనలను ప్రస్తావిస్తూ పోలీసుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ఘటనలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోదాడ నియోజకవర్గంలో ఇసుక, మట్టి, గంజాయి, మద్యం, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా వంటి కార్యకలాపాలను అరికట్టడంలో పోలీస్, సంబంధిత శాఖలు మరింత కఠినంగా వ్యవహరించాలని అన్నారు. అక్రమ కార్యకలాపాల వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.నివాస ప్రాంతాల్లో చోరీలు పెరుగుతున్నాయన్న ఆందోళన వ్యక్తం చేస్తూ పోలీసుల పెట్రోలింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. వడ్డీ వ్యాపారుల వేధింపులపై కూడా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కోదాడ టౌన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు దీర్ఘకాలంగా ఖాళీగా ఉండటంపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. పూర్తి స్థాయి అధికారిని నియమించి శాంతిభద్రతలను పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో హోంశాఖను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ ఈ అంశాలపై తక్షణమే దృష్టి సారించాలని బొల్లం మల్లయ్య యాదవ్ కోరారు. పోలీస్ శాఖపై ప్రజలకు నమ్మకం కలిగేలా పారదర్శకంగా వ్యవహరించాలని, బాధితుల ఫిర్యాదులను నిష్పక్షపాతంగా స్వీకరించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు.కోదాడలో బలహీన వర్గాల ప్రజలపై అక్రమ వేధింపులు, పోలీసుల దుర్వినియోగం జరుగుతున్నాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బొల్లం మల్లయ్య యాదవ్ హెచ్చరించారు.



## గుడిబండ గ్రామ పంచాయతీలో సోషల్ ఆడిట్

**పెన్షన్లు, ఉపాధి హామీ పనులపై సమగ్ర పరిశీలన**

**గ్రామ సర్పంచ్ మందులు నాగయ్య**

**కోదాడ ఆగస్టు 21 క్రైమ్ మిర్రర్ :** గుడిబండ: గుడిబండ గ్రామ పంచాయతీలో శుక్రవారం పెన్షన్లు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఉపాధి హామీ)కు సంబంధించిన అంశాలపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు, ఉపాధి హామీ పనుల వివరాలను పరిశీలిస్తూ పారదర్శకతను నిర్ధారించేలా ఆడిట్ చేపట్టారు.ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిదారులకు అందుతున్న సౌకర్యాలు, అర్హతలు, చెల్లింపుల వివరాలతో పాటు ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు, కూలీలకు కల్పించిన ఉపాధి, వేతనాల చెల్లింపులు తదితర అంశాలపై వివరాలను పరిశీలించారు. గ్రామంలో ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సోషల్ ఆడిట్ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య, గ్రామ కార్యదర్శి అవినాష్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్, గౌరవ వార్డు సభ్యులు, పెన్షన్ లబ్ధిదారులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వ పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యం, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడమే సోషల్ ఆడిట్ ప్రధాన ఉద్దేశమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## అన్నవరం బస్టాండ్‌లో మంత్రి మండిపల్లి ఆకస్మిక తనిఖీ

కాకినాడ: అన్నవరం ఆర్టీసీ బస్టాండ్‌ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడారు. స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకంపై మహిళా ప్రయాణికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. స్త్రీ శక్తి పథకం అమలుపై మహిళా ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలవుతోందని మహిళలు ప్రశంసలు కురిపించారు. అన్నవరం బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న మౌలిక సదుపాయాలపైనా మంత్రి ఆరా తీశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారులకు మంత్రి సూచించారు. అనంతరం అన్నవరం ఆర్టీసీ క్యాంటీన్‌ను సందర్శించారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందితో కలిసి అల్పాహారం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ఆత్మీయంగా మాట్లాడిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు

**గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతుంది: అచ్చన్న**

అమరావతి: అంబేద్కర్ కోనసీమ జిల్లా ఓడలరేవు నుంచి 'ముత్యాలమ్మ' బోటులో ఆగస్టు 3న చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతైన సంగతి తెలిసిందే. ఒడిశాలోని పారాదీప్ తీరం వద్ద ఒక పసుపు రంగు బోటును అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై తాజాగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చే వరకు అన్ని మార్గాల్లోనూ సెర్చ్ ఆపరేషన్ ఆపే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. ఈ గాలింపు చర్యల కోసం ఏకంగా 5 నౌకలు, 2 డోర్నియర్ విమానాలు, ఒక ప్రత్యేక హెలికాప్టర్‌ను రంగంలోకి దించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గల్లంతైన బోటు వివరాలను మయన్మార్, పోర్ట్÷‌‌–లబెయిర్, బంగ్లాదేశ్ కోస్ట్‌గార్డ్ అధికారులకు కూడా పంపించామని, సరిహద్దు తీరప్రాంతాల్లోనూ అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కేంద్ర కోస్ట్‌గార్డ్, నేవీ అధికారులతో ప్రభుత్వం నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తోందని తెలిపారు. ఈ నెల 24 తర్వాత కొత్త అధికారి బాధ్యతలు చేపట్టినప్పటికీ గాలింపు చర్యలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతాయని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. మత్స్యకారుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం వారి రక్షణకు అన్ని విధాలుగా కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా కల్పించారు.

## తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు

**సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ**

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు నడుస్తోంది అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. ఇటీవల కాలంగా తెలంగాణ కాంగ్రెస్ నేతల అంతర్గత కలహాల వల్ల రాష్ట్రంలో బీఆర్ఎస్ మళ్లీ పుంజుకుంటుం దన్నారు. రేవంత్ రెడ్డి నిక్కచ్చిగా వ్యవహరిస్తూ, ఏ తప్పూ చేయకుండా ఉంటేనే మంత్రులు, కిందిస్థాయి అధికారుల్లో భయం ఉంటుంది. ఇకనైనా సీఎం రేవంత్ రెడ్డి పాలనపై దృష్టిపెట్టాలని పరోక్షంగా సూచించారు. 22ఏ భూముల నిబంధనను కొందరు దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు.



## లండన్‌లో ఆక్స్‌ఫర్ యూనివర్సిటీని సందర్శించిన సిఎం

బ్రిటన్: లండన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రపంచంలోనే అత్యంత పురాతన, ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని సందర్శించారు. దాదాపు 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ విశ్వవిద్యాలయంలో శుక్రవారం సీఎం ప్రతినిధి బృందంతో కలిసి పర్యటించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను కూడా ముఖ్యమంత్రి సందర్శించారు. ఆక్స్‌ఫర్డ్ అనుబంధ విద్యాసంస్థల్లోని నూతన సంస్థల్లో ఇది ఒకటి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాయా ట్యూడర్, ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీ తెలంగాణ ప్రతినిధి బృందాన్ని క్యాంపస్‌లో కలిశారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి భారతదేశంతోనూ ప్రత్యేక అనుబంధం ఉందని.. మాజీ ప్రధానమంత్రి దివంగత ఇందిరా గాంధీ ఆక్స్‌ఫర్డ్‌లో విద్యాభ్యాసం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు ఇతర అధికారులు, ప్రతినిధులు ఉన్నారు.

## కర్నాటక డిఫెన్స్ మద్యం సీజ్

హైదరాబాద్:నగరంలోని అమీర్‌పేట్‌లో కర్ణాటక డిఫెన్స్ లిక్కర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఆర్‌నగర్ ఉమేష్ చంద్ర విగ్రహం వద్ద అనుమానాస్పదంగా మద్యం బాటిళ్లతో ఉన్న వ్యక్తిని పోలీసులు గుర్తించారు. వెంటనే అతడిని తనిఖీ చేయగా.. తొలుత నాలుగు కర్ణాటక డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లు పట్టుబడ్డాయి. విచారణలో గోవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి వద్ద నుంచి మద్యం తీసుకున్నట్లు సదరు వ్యక్తి వెల్లడించాడు. దీంతో వెంటనే గోవర్ధన్ రెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించగా.. దాదాపు 51 కర్ణాటక డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో మొత్తం 55 కర్ణాటక మద్యం బాటిళ్లను పోలీసులు సీజ్ చేశారు. కర్ణాటక నుంచి తక్కువ ధరకు డిఫెన్స్ మద్యం తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయాలు జరుపుతున్నట్లు విచారణలో బయటపడింది. ఒక్కో బాటిల్‌పై రూ.300 నుంచి రూ.500 వరకు లాభం పొందుతున్నట్లు తేలింది.

## గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**అధికారులకు సంజయ్ జాజు ఆదేశం**



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మ కంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ ? ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శు క్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఎస్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. దేశంలోని వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని, ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను కూడా సమ్మిట్‌కు ఆహ్వానించాలని సీఎస్ సూచించారు. అదేవిధంగా, దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, శాస్త్ర?సాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాల ప్రముఖులను సమ్మిట్‌లో పాల్గొనేలా ముందుగానే ఆహ్వానాలు పంపాలని ఆదేశించారు. సమ్మిట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలను అప్పగించి సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ÷లంగాణలోని వివిధ రంగాల సామర్థ్యాన్ని, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా వివిధ రంగాలకు సంబంధించిన ఎక్స్ పో (ఇలూనీబ)లను ఏర్పాటు చేయాలని, వాటిలో ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ పేర్కొన్నారు.అలాగే, తెలంగాణ రైజింగ్ ? ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు మార్గదర్శకత్వం అందించేందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో కూడిన సలహా మండలి ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమ్మిట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించి, తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్టించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శ్రీ శశాంక, పరిశ్రమలశాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## పెల్లెట్ గన్ బాధితుడికి న్యాయం చేయాలి: రాహుల గాంధీ

న్యూఢిల్లీ): పెల్లెట్ గన్ బాధితుడికి న్యాయం చేయాలంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ నిరసనకు దిగారు. ఢిల్లీలోని పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు తెరతీశారు. సంసద్ యాత్ర సందర్భంగా పెల్లెట్ గన్ ప్రయోగంతో తనకు గాయాలయ్యాయని సాహిల్ లోచాబ్ అనే యువకుడు ఆరోపించాడు. ఈ విషయమై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తాను ఎన్ని సార్లు కోరినా పోలీసులు లక్ష్యపెట్టడం లేదని ఆరోపించాడు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ నేడు సాహిల్ లోచాబ్‌ను వెంట తీసుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తొలుత రాహుల్ గాంధీ కాన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, న్యూఢిల్లీ డీసీపీ సచిన్ శర్మ పార్లమెంటు స్ట్రీట్ పీఎస్‌లో ఉన్నారని తెలియడంతో అక్కడకు వెళ్లారు. పె÷–లలెట్ గన్‌తో దాడి ఘటనపై దర్యాప్తు ఎంత వరకూ వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంపీ రాహుల్ గాంధీ అకస్మాత్తుగా రావడంతో పోలీసులు ఒకింత ఆశ్చర్యపోయారు. అయితే, ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు మాత్రం వారు తిరస్కరించారు. దీంతో, పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. సంసద్ ఛలో యాత్ర సందర్భంగా పార్లమెంటుకు సమీపంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది విద్యార్థులపై పె÷–లలెట్ గన్‌తో కాల్పులు జరిపారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

# ఎనిమిదేళ్ల విరామం తర్వాత వెండితెరపైకి ప్రీతి జింటా: ఆమిర్ ఖాన్ బ్యానర్లో గ్రాండ్ రీఎంట్రీ

ఒకప్పుడు టాలీవుడ్ ప్రేక్షకులను సైతం మెప్పించిన బాలీవుడ్ నటి ప్రీతి జింటా... సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమయ్యారు. మహేశ్ బాబుతో 'రాజకుమారుడు', వెంకటేశ్ సరసన 'ప్రేమంటే ఇదేరా' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు అలరించిన ఆమె, వివాహం అనంతరం సినిమాలకు దూరమయ్యారు. ఇప్పుడు దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఒక భారీ పీరియాడికల్ డ్రామాతో గ్రాండ్ రీఎంట్రీ ఇస్తున్నారు. బాలీవుడ్ స్టార్ సన్నీ డియోల్ సరసన ప్రీతి జింటా కథానాయికగా నటించిన లేటెస్ట్ పీరియడ్ డ్రామా మూవీ 'బట్వార్ 1947'. 1947 నాటి దేశ విభజన నేపథ్యంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆమిర్ ఖాన్ నిర్మించగా, విలక్షణ దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి తెరకెక్కించారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చారు. ప్రీతి జింటాతో పాటు సీనియర్ నటి షబానా అజ్మీ, ఆలీ ఫజల్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. దేశ విభజన నాటి పరిస్థితులు, మానవీయ సంబంధాలు, ప్రజలు ఎదుర్కొన్న భావోద్వేగ ఘర్షణల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఇందులో ప్రీతి జింటా ఎంతో ప్రాధాన్యత ఉన్న, బలమైన పాత్రలో నటించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని తుది పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.







# 'టాక్సిక్'లో కియారా ఇంటిమేట్ సీన్స్‌పై ట్రోలింగ్..

## మహిళలనే ఎందుకు టార్గెట్ చేస్తున్నారంటూ హుమా ఖురేషి ఫైర్!

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా, గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రం 'టాక్సిక్' విడుదలకు ముందే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత యశ్ నటిస్తున్న సినిమా కావడంతో దేశవ్యాప్తంగా ఈ చిత్రంపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఇటీవల విడుదలైన 'తబాహీ' పాట సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకున్నప్పటికీ, అందులో హీరో యశ్, హీరోయిన్ కియారా అద్వానీ మధ్య ఉన్న కొన్ని ఇంటిమేట్ సన్నివేశాలు ఇప్పుడు పెద్ద చర్చకు దారితీశాయి. 'తబాహీ' పాట విడుదలైన తర్వాత సోషల్ మీడియాలో కియారా అద్వానీపై కొందరు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. వివాహం అయ్యాక, తల్లి అయిన తర్వాత ఇలాంటి సన్నివేశాల్లో నటించడం సరైందేనా అంటూ ప్రశ్నిస్తూ ఆమెను లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ చేస్తున్నారు. కొందరు నెటిజన్లు ఆమె భర్త సిద్ధార్థ్ మల్హోత్రా సోషల్ మీడియా ఖాతాల్లోకి వెళ్లి కూడా అసభ్యకర వ్యాఖ్యలు చేయడం వివాదానికి దారితీసింది. అయితే ఇదే పాటలో నటించిన యశ్‌కు కూడా వివాహం అయ్యి పిల్లలు ఉన్నప్పటికీ, ఆయనపై మాత్రం ఎలాంటి విమర్శలు చేయకుండా ప్రశంసించడం గమనార్హం. ఈ ద్వంద్వ వైఖరిపై సినీ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ వివాదంపై తాజాగా స్పందించిన నటి హుమా ఖురేషి, మహిళలను మాత్రమే ఇలా టార్గెట్ చేయడం చాలా బాధాకరమని అన్నారు. ఒక నటిగా పాత్రలో భాగంగా చేసిన సన్నివేశాలను వ్యక్తిగత జీవితంతో ముడిపెట్టి విమర్శించడం చాలా దురదృష్టకరం. మహిళలనే ఇలా వేధించడం అసహ్యంగా ఉంది. ఇలాంటి విమర్శలకు మాటలతో సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. మా సినిమానే ప్రేక్షకులకు సరైన సమాధానం చెబుతుంది. ఆగస్టు 26న విడుదలయ్యే 'టాక్సిక్' అందరికీ జవాబు ఇస్తుంది అని ఆమె స్పష్టం చేశారు. హుమా వ్యాఖ్యలకు నటుడు సాకిబ్ సలీమ్ కూడా మద్దతు తెలిపారు. సోషల్ మీడియాలో వ్యక్తుల వ్యక్తిగత జీవితాలపై తీర్పులు ఇవ్వడం ప్రమాదకర ధోరణి అని ఆయన అన్నారు. అలాగే బ్రిటీష్ నటుడు బెనెడిక్ట్ గారెట్ కూడా స్పందిస్తూ, "యశ్‌కు పెళ్లై పిల్లలు ఉన్నా ఎవరూ ప్రశ్నించడం లేదు. అదే కియారా విషయంలో మాత్రం విమర్శలు రావడం సమాజంలో ఇంకా ఉన్న లింగ వివక్షకు నిదర్శనం. నటీనటులు పాత్రల్లో జీవించడం వారి వృత్తి. దాన్ని వ్యక్తిగత జీవితంతో కలపడం సరికాదు" అని వ్యాఖ్యానించారు. 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో యశ్ సరసన కియారా అద్వానీ, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 26న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# ఈ ఏడాదికాలం నాకు నేర్పింది అదే

నటి అనుపమ పరమేశ్వరన్ భావోద్వేగానికి లోనయ్యారు. గడచిన ఏడాదికాలం తన జీవితం ఎంతో కష్టంగా గడిచిందని, ఒకానొక దశలో మానసికంగా కృంగిపోయానని అనుపమ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. తమిళ నటుడు ధృవ్‌విక్రమ్‌తో ఆమె ప్రేమలో ఉన్నట్టు, వారి ప్రేమకు బ్రేకప్ అయినట్టు గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రూమర్లు వినిపిస్తున్నాయి. తాజాగా అనుపమ పరమేశ్వరన్ మాట్లాడింది ఆ విషయం పైనేనంటూ సోషల్ మీడియాలో కొత్త చర్చ మొదలైంది. ఇంకా చెబుతూ 'ఎంత కష్టపడితే అంత పరిపూర్ణత సిద్ధిస్తుంది. ఈ ఏడాదికాలం నాకు నేర్పింది అదే. ఇన్నాళ్లూ ఇతరుల కోసం బతికా. నా జీవితం కూడా నా చేతుల్లో లేదు. ఇప్పుడు నాకోసం నేను బతుకుతున్నా. నా జీవితాన్ని నా నియంత్రణలోకి తీసుకున్నా. గతాన్ని వదిలి ధైర్యంగా ముందుకు సాగుతున్నా. ఈ సందర్భంగా కొంతమందికి ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. వ్యక్తిగత జీవితంలోని ప్రతి విషయాన్నీ అందరికీ చెప్పాల్సిన అవసరం లేదు' అంటూ అనుపమ ఘాటుగా స్పందించింది. మరి ఈ వ్యాఖ్యల్లో అంతర్యం ఏమిటో అనుపమకే తెలియాలి.





# తండ్రీకొడుకులుగా మెగాస్టార్?

అగ్ర కథానాయకుడు చిరంజీవికి ద్విపాత్రాభినయాలు కొత్తేం కాదు. నాటి 'నకిలీ మనిషి' నుంచి 'ఖైదీనంబర్ 150' వరకూ చాలా సినిమాల్లో డ్యూయెల్ రోల్స్‌తో అదరగొట్టారాయన. ప్రస్తుతం చిరంజీవి నటిస్తున్న 'మెగా 158'(వర్కింగ్ టైటిల్) చిత్రంలో కూడా ఆయన ద్విపాత్రాభినయం చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. మెగాస్టార్‌ని కొత్తగా చూపించాలనే తపనతో దర్శకుడు కేఎస్ రవీంద్ర(బాబీ) తయారు చేసుకున్న కథ ఇది. ఇందులో చిరంజీవి పాత్రల్లో చాలా వేరియేషన్స్ ఉంటాయట. మరో ఆసక్తికరమైన విశేషం ఏంటంటే.. ఇందులో చిరంజీవి తండ్రి, కొడుకులుగా కనిపిస్తారని తెలిసింది. ఈకథలో ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా బలంగా ఉంటాయట. బ్లాక్‌బస్టర్ 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరు, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. సంక్రాంతి రిలీజ్ టార్గెట్‌గా శరవేగంతో చిత్రీకరణ జరుపుతున్నారు. ఈ సినిమా టైటిల్, టీజర్‌ని చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 22న విడుదల చేయనున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ, లోహిత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.